తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





# పంటలపై ఏనుగుల దాడులు

రామకుప్పం, ఏప్రిల్ 27 ప్రభాతవార్త



మండలంలోని రామాపురం తాండా గ్రీమ సమీపంలో రైతులు సాగుచేస్తున్న పంటలపై ఏనుగులు శనివారంరాత్రి కూడా దాడులు చేశాయి. రెండు ఏనుగులు గ్రామ సమీపంలో కాజునాయక్, గోవిందనాయక్, రామరాజ్ నాయక్, కాంగ్రెస్ నాయక్, అమ్ము, రామూర్తి, కుమార్‌నాయక్ తదితర రైతులు సాగు చేసిన రాగి, వరి, అరటి, టమోటా తోటలను నాశనం చేశాయి. అలాగే వ్యవసాయ పరికరా లు ధ్వంసం చేశాయి. రాత్రంతా ఏనుగుల ఘీంకారాలతో జనం బెంబేలెత్తిపోయారు. అటవీ అధికారులు బాణసంచా కాల్చి ఏనుగులను దారి మళ్లించే ప్రయత్నాలు చేపట్టారు.

# మృతుల ఆత్మకు శాంతికలగాలి

## -నగరంలో సనాతన వారసులు నిరసన

తిరుపతి,ఏప్రిల్ 27ప్రభాతవార్త:



కాశ్మీర్ పహల్గాంలో 28మంది ఉగ్రవాదుల దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి కలగాలని సనాతన వారసులు ఆదివారం సాయంత్రం నిరసన ప్రదర్శన చేశారు. తుడ మైదానం నుండి కృష్ణాపురంఠాణా వరకు శాంతి ర్యాలీలోరాధామనోహర్‌దాస్, గుండాల గోపీనాధరెడ్డి, పృధ్వీరెడ్డి, విజయ కుమార్, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, శేఖర్, వేణురాయల్, నిర్మలమ్మ పాల్గొన్నారు. ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు.

# 'లక్కీ ఛైర్మన్' ఎవరో..



తెదేపా తరపున ఛైర్మన్ పదవి ఆశిస్తున్న జిమ్‌దాము..సోమశేఖర్..సెల్వరాజ్

**కుప్పం మున్సిపల్ ఛైర్మన్ రేసులో జిమ్‌దాము..సోమశేఖర్..సెల్వరాజ్ !!**

**- సిఎం చంద్రబాబు తమ పేరునే ప్రకటిస్తారని ఆశగా ముగ్గురూ ..**

కుప్పం, ఏప్రిల్ 27 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు సొంత నియోజకవర్గం అయిన కుప్పంలో కీలకమైన మున్సిపల్ ఛైర్మన్ పదవికి మరికొన్ని గంటల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈనెల 28వతేది ఛైర్‌పర్సన్ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమీషనర్ నీల ం సాహ్ని ఆదేశించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఓ పక్క అధికార యంత్రాంగం ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. కొత్తగా ఎన్నికయ్యే మున్సిపల్ ఛైర్మన్ ఎవరనే అంశం ఇప్పుడు హాట్‌టాఫిక్‌గా మారింది. కుప్పం మున్సిపల్ ఛైర్మన్ గిరిని దక్కించుకోవాలని అధికార తెలుగుదేశం పార్టీ గట్టి నిశ్చయంతో ఉంది. అందుకు తగిన సన్నాహాలు కూడా ముగించినట్లు సమాచారం. ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ నేతృత్వంలో ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర నేత డా॥ బిఆర్ సురేష్‌బాబు రంగంలో దిగారు. ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ తనదైన శైలిలో ఎన్నికల వ్యూహం అమలు చేస్తున్నట్లు సమాచారం. అధికార తెలుగుదేశం పార్టీ తరపున ఛైర్మన్ పదవి ఆశిస్తున్న వారిలో ప్రస్తుత ఫ్లోర్ లీడర్ దామోదరం (జిమ్‌దాము), కౌన్సిలర్లు అయిన సోమశేఖర్, సెల్వరాజ్‌లు ఉన్నారు. ఈ ముగ్గురూ తమకంటే తమకే అదృష్టం వరిస్తుందని భావిస్తున్నారు. సిఎం చంద్రబాబునాయుడు తమ పేరునే ఛైర్మన్ పదవికి ప్రకటిస్తారని ముగ్గురూ ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ ముగ్గురిలో సిఎం చంద్రబాబు ఎవరిపై మొగ్గు చూపుతారోనే విషయంగా పార్టీ శ్రేణుల్లో సైతం తీవ్ర ఉత్కంఠత నెలకొంది. మరో పక్క వైఎస్సార్సీ తరపున రెండో వైస్ ఛైర్మన్‌గా ఉన్న హాఫీజ్ సైతం వైకాపా కౌన్సిలర్లపై ఎంతో కొంత నమ్మకం పెట్టుకున్నట్లు తెలిసింది. వైఎస్సార్సీ కౌన్సిలర్లతో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్సీ భరత్‌లు చర్చలు జరిపినట్లు సమాచారం.

**క్యాంపుల నుంచి నేరుగా ఎన్నికల కేంద్రానికే :**

మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న అధికార తెదేపా, ప్రతిపక్ష వైకాపా పార్టీలు తమ కౌన్సిలర్లకు మూడు రోజుల ప్రత్యేక క్యాంప్‌లను నిర్వహించాయి. క్యాంప్‌లకు హాజరైన కౌన్సిలర్లు నేరుగా ఎన్నికల కేంద్రమైన కుప్పం మండల కార్యాలయంకు చేరుకునేలా ఆయా పార్టీలు చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. ఏది ఏమైనా సోమవారం మధ్యాహ్నం 12గంటల లోపే కుప్పం మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక పూర్తి అయ్యే అవకాశాలు మెండుగా కన్పిస్తున్నాయి.

**విద్యార్థి మృతదేహంతో**

# కుటుంబ సభ్యుల ర్యాలీ..!

## స్థంభించిన రాకపోకలు..



కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న మృతుని కుటుంబ సభ్యులు , విద్యార్థి మృతదేహంతో ర్యాలీ

గంగవరం, ఏప్రిల్ 27, ప్రభాతవార్త :

ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి యోగేష్ మృతదేహంతో కుటుంబసభ్యుల ర్యాలీ, ధర్నా, రాస్తారోకో, నిరసనలతో అట్టుడికిపోయింది. పలమనేరు,గంగవరం రహదారిపై పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ నుండి పలమనేరు మదనపల్లె జాతీయ రహదారి మీదుగా మదర్‌థెరిసా కళాశాల వరకు దాదాపు ఏడు కిలోమీటర్ల దూరం ర్యాలీ చేపట్టారు. బాధితుల కథనం మేరకు కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం గెసికపల్లెకు చెందిన సుబ్రమణ్యం మొదటి భార్య సుమతి దంపతులకు ఇద్దరు కుమారులు,ఒక కుమార్తె సంతానం.పెద్ద కుమారుడు యోగేష్ మండలంలోని మదర్‌థెరిసా కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. యోగేష్ మూడు సబ్జక్టులలో ఫెలవ్వడంతో కళాశాల ప్రాంగణంలోని హస్టల్‌లోనే ఉంటూ సప్లమెంటరీ పరీక్షలు రాయడానికి చదువుకుంటున్నాడు. పరీక్షలకు బయపడి మనస్థాపానికి గురై హస్టల్‌లోని తన గదిలో ఆత్మహత్య చేసుకున్న సంఘటన తెలిసిందే. అయితే యోగేష్ కుటుంబ సభ్యులు మాత్రం తమ కుమారుడు కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే మృతి చెందాడని ఆరోపించారు.తల్లిదండ్రులు వచ్చేలోపే కళాశాల యాజమాన్యం యోగేష్ మృతదేహాన్ని పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడంపై పలు అనుమానాలు వ్యక్తం చేశారు.దీంతో ఆదివారం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రి నందు శవపరీక్ష అనంతరం యోగేష్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులు చేతులపై ఆసుపత్రి మార్చురీ నుండి కళాశాల వరకు తీసుకుని వచ్చి కళాశాల ఎదురుగా రహదారిపై మృతదేహంతో బైటాయించారు. చేపట్టారు. పలమనేరు డిఎస్పీ డేగల ప్రభాకర్, గంగవరం అర్బన్,రూరల్,పలమనేరు,పుంగనూరు రూరల్, సిఐలు ప్రసాద్,మురళి,నరసింహరాజు,రాంభూపాల్‌లు కళాశాల వద్దకు చేరుకుని ఆందోళనకారులతో,యాజమాన్యంతో చర్చించి మృతుని కుటుంబసభ్యులకు పరిహారంతో పాటు,బాధిత కుటుంబ సభ్యుల విద్యార్థులకు ఉచిత విద్యకు హామీ ఇవ్వడంతో యోగేష్ కుటుంబసభ్యులు శాంతించి ధర్నాను విరమించుకున్నారు.అనంతరం యోగేష్ మృతదేహాన్ని స్వగ్రామం గెసికపల్లెలో ఖననం చేశారు.

**అనుమానాస్పద వ్యక్తులపై**

# మరింత నిఘా !

**తిరుమల నడకమార్గాల్లో మెటల్‌డిటెక్టర్లతో తనిఖీలు**





తిరుమల,ఏప్రిల్ 27ప్రభాతవార్తప్రతినిధి:

కొండపైకి చేరుకునే ఘాట్‌రోడ్డుమార్గంతోబాటు రెండు కాలినడక మార్గాల్లో తిరుపతి జిల్లా పోలీసుయంత్రాంగం, ఆక్టోపస్ బలగాలు గట్టి నిఘా ఉంచాయి. ప్రత్యేక బృందాలతో యాత్రికులు బసచేసే గోగర్భమ్‌డ్యామ్ సమీపంలోని మఠాలలో, వసతిసముదాయాలు, విశ్రాంతి గృహాల్లో ఏకకాలంలో క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. ఈ ప్రక్రియ 24గంటలూ అణువణువూ నిశితంగా పరిశీలించి, యాత్రికుల పేరుతో గదుల్లో దిగిన, బసచేస్తున్న వారి వివరాలు, ఆధార్‌కార్డులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆదివారం వేకువజామున 3గంటల నుండి అలిపిరి నడకమార్గం, 5గంటల నుండి శ్రీవారిమెట్టుమార్గాల్లో తిరుమల పోలీసులు, విజిలెన్స్ సిబ్బంది బృందాలుగా విడిపోయి మెట్లమార్గంలో యాత్రికులను, వారి లగేజీలను తనిఖీ చేశారు.

# తిరుమలలో పోటెత్తిన భక్తులు



# రికార్డు స్థాయిలో రాహుకేతుదోష నివారణ పూజలు

**ఒక్కరోజు సేవల ఆదాయం రూ.1.02కోట్లు .. రూ.200 టిక్కెట్ల కౌంటర్ వద్ద తోసులాట**

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 27 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం అమావాస్య సందర్భంగా కిట కిట లాడింది.అయితే రూ.200 టిక్కెట్లు జారి కౌంటర్ వద్ద భక్తులు సంయ మనం కోల్పోయి టిక్కెట్లు కోసం తోసులాటచోటు చేసుకుంది.ఒక్కరోజు సేవా టిక్కెట్లు ద్వారా రూ.1 కోటి 2లక్షల 62వేల 356లు వచ్చినట్లు దేవస్థానం అధికారికంగా ప్రకటించారు. రికార్డు స్థాయిలో 8766 పూజలు జరిగాయి. సుమారు 30వేల మంది దర్శించుకున్నారు.భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇఒ టి.బాపిరెడ్డి పర్యవేక్షించారు.అయితే స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి సూచనలతో ముందస్తు ప్రణాళికతో ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు.





**శ్రీకాళహస్తి చరిత్రలో రికార్డు స్థాయి పూజలు:**

శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయ చరిత్రలో,రాహుకేతుదోష నివారణ పూజలు ప్రారంభించినప్పటి నుంచి లేని విధంగా ఆదివారం అమావాస్య సందర్భంగా రికార్డు స్థాయిలో రాహుకేతుదోష నివారణ పూజలు జరిగాయి.8766 పూజలు జరిగినట్లు అధికారులు ప్రకటించారు. ఆలయం ఆదాయం కూడా గణనీయంగా వచ్చింది.సుమారు 30వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక మూడవ గేటు ఎదురుగా రూ.200ల టిక్కెట్లు కౌంటర్‌ను ఏర్పాటు చేసారు. అక్కడ వచ్చిన భక్తులు టిక్కెట్లు కోసం సంయమనం కోల్పోతున్నారు. దాంతో వేచి ఉండలేక తోసులాడుకుంటున్నారు. అన్ని సేవా టిక్కెట్లును మూడవగోపురం బయట ఏర్పాటుకు చక్కటి షెడ్డును ఏర్పాటు చేసారు. కానీ కౌంటర్లు తయారు చేయటంలో జాప్యం జరుగుతుంది. దీనికి కమిషనర్ అనుమతి రావాల్సి ఉంది. దాంతో రద్దీ అధికమైనపుడు ఇబ్బంది పడుతున్నారు. ఒక్కసారిగా 30వేల మంది భక్తులు రావటంతో ఆలయం కిట కిట లాడింది.ఇక అభిషేకాలు పరిశీలిస్తే స్వామి అమ్మవార్ల అభిషేకాలు 139 జరిగాయి. మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు 38 జరిగినట్లు ప్రకటించారు. వచ్చిన భక్తులకు సుదర్శనం కల్పించుటకు ఇఒ డి.బాపిరెడ్డి,ఎఇఒ విద్యాసాగర్‌రెడ్డి, ఎస్‌పిఎఫ్ సిబ్బంది తిప్పలు పడ్డారు.కానీ సెక్యూరిటీ సిబ్బంది ప్రేక్షకులుగా మారారు.అయితే క్యూలైన్లలో భక్తులు నిరీక్షించకుండా ఇబ్బంది పడకుండా క్యూలైన్లలో మజ్జిగ, మంచినీరు అందించారు.ఉదయం నుంచి రాహుకేతుదోష నివారణ పూజలకు వచ్చిన భక్తులు ఇబ్బంది పడకుండా ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ పూజలు జరిపించారు. దాంతో పూజలు జరిపించుకున్న భక్తులుఎలాంటి ఇబ్బంది పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు.

# జాతర సమీపిస్తున్నా....

# ఆలయ పాలకమండలి లేనట్లే!?

**-ఫెస్టివల్ కమిటీతోనే జాతర నిర్వహణకు సంసిద్ధత**





ప్రభాతవార్త-తిరుపతి:

రాయలసీమజిల్లాల్లోనే ఎంతో ప్రసిద్ధిగాంచిన,వారంరోజులుపాటు జరిగే తిరుపతి తాతయ్యగుంట గంగమ్మజాతర సమీపిస్తున్నా, ఆలయ పాలకమండలి ఏర్పాటు జాప్యమవుతోంది. గంగమ్మజాతరను ఎంతో వేడుకగా ప్రతి ఏడాది తిరుపతివాసులేగాక చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు కూడా తరలివచ్చి జరుపుకోవడం ప్రత్యేకత. వారంరోజులపాటు ఆలయంలో పలు రకాల కైంకర్యాలు, పూజా కార్యక్రమాలు ,అలంకరణలు అమ్మవారికి జరిపిస్తారు. ఇవన్నీ కూడా పాలకమండలి సారధ్యంలో జరిగేవి. అయితే ఈ ఏడాది రానున్న మేనెల 6వతేదీనుండి 13వతేదీ వరకు జరిగే తాతయ్యగుంట గంగమ్మజాతర స్థానిక ఎమ్మెల్యే సారధ్యంలో దేవాదాయశాఖ ఉన్నతాధికారులు,గంగమ్మ ఆలయ ఈఓతోనే ఫెస్టివల్ కమిటీ ఏర్పాటుకానుంది. ఈ కమిటీ ఆలయంలోనే ఉండి వారంరోజులపాటు భక్తులకు సకల సౌకర్యాలు కల్పించనుంది. గత ఏడాది రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో అప్పటివరకు కొనసాగిన వైసిపి అనుచరుల ఆలయ కమిటీ రద్దయ్యింది. గత పదినెలలుగా నూతనంగా ఆలయ పాలకమండలి ఏర్పాటు కావాల్సి ఉన్నా తిరుపతిలో టిడిపి, జనసేన, బిజెపి నాయకుల మధ్య కుదరని సయోధ్యతో ఆలయ ఛైర్మన్ నియామకం జాప్యం జరుగుతోంది. ఈ ఆలయ ఛైర్మన్ పోస్టుకు టిడిపికి చెందిన పార్టీ నేతలు తీవ్రస్థాయిలోపోటీపడుతున్నారు. గంగమ్మ ఆలయం అభివృద్ధికి టిటిడి కూడా సహకారం అందించడం విశేషం. తిరుపతి గ్రామదేవతగా కొలువైన తాతయ్యగుంట గంగమ్మ జాతర వేడుకలు వారంరోజులుపాటు భక్తితో అంగరంగ వైభవంగా జరిపించడం ఆనవాయితీ. మేనెలలో 6వతేదీ మంగళవారం రాత్రి చాటింపుతో మొదలయ్యేజాతర 7వతేదీ బుధవారం నుండి 13వతేదీ మంగళవారం వరకు వివిధ రకాల అలంకరణల్లో గంగమ్మ దర్శనమిస్తుంది. తిరుపతి తిరుమల పరిసరాల్లోనే భక్తులేగాక తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుండి భక్తులు భారీగా వస్తారు. ఒక్కోరోజు ఒక్కోరక వేషధారణలో భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. ఆలయ పాలకమండలి ఏర్పాటుకు మరింత సమయం పట్టనుండటంతో జాతర సమీపిస్తున్న సమయంలో రాజకీయ నేతల ప్రమేయం ఉండకూడదనే భావన మంత్రులు కూడా వ్యక్తంచేస్తున్నారు.గంగమ్మ జాతర వేడుకలకు టిటిడి, తుడ, నగరపాలకసంస్థ సహకారంతో ఈ ఏడాది ఫెస్టివల్‌కమిటీతోనే జరిపించేయనున్నారు.ఇప్పటికే అమ్మవారి జాతర వాల్‌పోస్టర్లను కూడా ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కూటమి నేతలు ఆవిష్కరించారు.

**ధర్మరాజస్వామి బ్రహ్మోత్సవాలకు**

# పోటెత్తిన భక్తులు



వాటంబేడులో తిరునాళ్లకు పోటెత్తిన భక్తులు

తడ, ఏప్రిల్ 27 ప్రభాతవార్త

తడ మండలం వాటంబేడుకుప్పంలో జరుగుతున్న శ్రీధర్మరాజస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలకు జనం పోటెత్తారు. ఆదివారం సెలవురోజు కావడం, ద్రౌపతీ కల్యాణం ప్రత్యేక కార్యక్రమం ఉండటంతో భక్తజనం ఎక్కువగా తరలివచ్చారు. తిరునాళ్లలో ఏర్పాటు చేసిన వివిధ అలంకరణలు, నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. తమిళనాడు నుంచి కూడా భక్తులు ఎక్కువగా తరలివచ్చారు. ఆదివారం ఉదయం చిత్రసేన యుద్ధం ఘట్టాన్ని భారత పఠనంతో వినిపించారు. ఆ తర్వాత ద్రౌపతీ కల్యాణం సాంప్రదాయబద్ధంగా జరిగింది. రాత్రి గ్రామోత్సవంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రాత్రి ఉత్సవాలకు సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ హాజరయ్యారు. ఆమెతో పాటు పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు. ఈ ఉత్సవాలను చాలారోజుల తర్వాత జరుపుతుండటంతో తడ మండల పరిధిలోని పులికాట్ జాలర్ల కుప్పాల నుంచి జనం విశేషంగా హాజరవుతున్నారు. అక్కడ రకరకాల విద్యుద్దీపాలంకరణలు, జెయింట్ వీల్స్ వంటి వినోద కార్యక్రమాలను వీక్షిస్తున్నారు.

# అమావాస్య ఉత్సవం: స్వామి అమ్మవార్ల దర్శనం

**శ్రీకాళహస్తి,ఏప్రిల్ 27 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రతి నెల ఒక్కొక్క ఉత్సవం నిర్వహిస్తున్నారు.ఈ నేపథ్యంలో అరుదుగా వచ్చే ఆదివారం అమావాస్య రావటంతో ఆలయంలో భక్తుల తాకిడి అధికమైంది. ఆదివారం రాత్రి స్వామి అమ్మవార్లను ము స్తాబు చేసి బోయిలు మోసుకుంటూ మూడవ గోపురం,రాజగోపురంనుంచి స్వామి అమ్మ వార్లను వాహనాల మండపం వద్దకుచేర్చారు. అక్కడ వాహనాలపై ప్రతిష్టించి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంను టెంపుల్ ఇన్స్పెక్టర్ సుదర్శనం నాయుడు పర్యవేక్షణలో సాగింది. ఉత్సవం నాలుగుమాడావీధుల్లో సాగగా ఇంటింటి వద్ద హారతులిచ్చారు.

# అవినీతికి 'ఉపాధి' కేరాఫ్ అడ్రస్

## - అక్రమార్కులకు కల్పతరువుగా మారిన ఉపాధి పథకం

పాలసముద్రం, ఏప్రిల్ 27 ప్రభాతవార్త:

పాలసముద్రం మండలంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఈ పథకం కింద కళ్ళ ఎదుటే అవినీతి జరుగుతున్నప్పటికీ క్షేత్ర స్థాయి నుండి జిల్లా స్థాయి అధికారుల వరకు ఎవ్వరు ఏమి పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు నిధులను ఇష్టారాజ్యంగా జేబులు నింపుకొంటున్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం పాలసముద్రం మండలంలో కూలీలకు ఉపాధి కల్పిస్తున్నదా! లేక అక్రమార్కులైన వారు పనులు చేయకుండానే జేబులు నింపుకోవడానికి అమలు చేస్తున్నారా! అనే విషయం తెలియని పరిస్థితి నెలకొంది. మండలంలోని కొన్ని గ్రామాల్లో ఉపాధి పనులకు కూలీలు ఎవ్వరు వెళ్ళకపోయినా అధికార పార్టీకి చెందిన ఒకరిద్దరు నాయకుల ఒత్తిడిని క్షేత్ర స్థాయి ఉపాధి సిబ్బంది కొంతమంది పనులకు వెళ్ళి వారు పనులు చేసినట్లు మస్టర్లలో నమోదు చేస్తున్నారు. ఇదే సమయంలో మండలంలో ఉపాధి పనులు ఇవ్వకపోవడంతో ఇక్కడ పుట్టి పెరిగిన కూలీలు కొంతమంది ఉపాధి కోసం పట్టణాలు, నగరాల వైపు వెళ్ళే పరిస్థితి నెలకొంది. ఈ



పథకం ప్రస్తుతం మండలంలో ప్రక్కదారి పట్టి అక్రమార్కుల జేబులు నింపే కార్యక్రమంగా తయారైంది. పాలసముద్రం మండల పరిధిలో 3 వేలకు పైగా జాబ్ కార్డులు వున్నాయి. ఇందులో ప్రస్తుతం 1,500 మంది కూలీల వరకు పనులు చేస్తున్నారని ఉపాధి సిబ్బంది పేర్కొంటున్నారు. అయితే పనులు చేస్తున్న వారు తక్కువ సంఖ్యలో వుండటం మస్టర్లలో ఎక్కువ మందికి పెడ్తుండటంతో నిజంగా పని చేస్తున్న కూలీలకు దిమ్మె తిరుగుతుంది. మండల పరిధిలోని కావేరిరాజుపురం, గంగమాంబపురం గ్రామ పంచాయతీల్లో ఎక్కువ అవినీతి జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. వనదుర్గాపురం పంచాయతీకి చలమరాజుఇండ్లు గ్రామంకు చెందిన అధికార పార్టీకి చెందిన ఓ నేత తాను చెప్పిన వ్యక్తుల పేరిట జాబ్ కార్డులు చేసి వారు పనులు చేసినట్లు మస్టర్లు పెట్టాలని ఫీల్డ్ అసిస్టెంట్‌ను బెదిరించి పనులు చేసుకుంటున్నట్లు తెలిసింది. అలాగే మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో గత మూడు నెలలుగా జరిగిన ఉపాది పనులకు సంబంధించి ఎలాంటి పనులు చేయకుండానే సీనియర్ మేట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్లు డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు వున్నాయి. అలాగే కొన్ని గ్రామాల్లో టెక్నికల్ అసిస్టెంట్లు చెరువు పనులకు సంబంధించి జరిగిన పనులపై భారీగా కొలతలు వ్యత్యాసం చేసి లక్షల రూపాయలు జేబులు నింపుకున్నట్లు ఆరోపణలు వున్నాయి. మండలంలో ఉపాధి అవినీతిపై అధికార పార్టీకి చెందిన వారే అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అయితే ఈ వ్యవహారం బహిర్గతం కాకుండా లోలోపల సర్దుకోవడానికి అధికార పార్టీకి చెంది నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విచారించి చర్యలు తీసుకోవాల్సి వుంది.

## చట్టాన్ని చేతులోకి తీసుకుంటే జైలు జీవితం తప్పదు

–తహశీల్దార్ హెచ్చరిక




.తొట్టంబేడు, ఏప్రిల్ 27 ప్రభాతవార్త

చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే జైలు జీవితం తప్పదని తహశీల్దార్ మధుసూధనరావు హెచ్చరించారు. మండలంలోని చిట్టత్తూరు గ్రామంలో డికెటి సుమారు 1505 ఎకరాలు భూమి ఉందని ఈభూములు గతంలో స్ధానికులకు కాకుండా స్ధానికేతరులైన తిరుత్తని శ్రీకాళహస్తి, తిరుపతి, నెల్లూరు, చెన్నై, ఇతర రెవెన్యూ లెక్కదాఖలా సర్వేనంబర్ 40/1లో 4.12 ఎకరాలు ప్రభుత్వ రికార్డుల మేరకు కాలువ పోరంబోకకు భూమిగా ఉందని ఈభూమికి గత వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు 1ఎ, 1బి, 1సిగా రికార్డులను తారుమారు చేసి వాళ్ళు ఇష్టం వచ్చినట్లు రికార్డులు మార్చివేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అరాచకాలకు, అక్రమార్కులకు అడ్డుకట్ట వేయాల్సిందిగా స్ధానిక ఎంఎల్ఏ సుధీరెడ్డి ఆదేశాలు ఇవ్వడం జరిగిందనిదీంతో వెంటనే స్పందించిన తహశీల్దార్ ఈభూముల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. అయితే ఈభూమిని కొనుగోలు చేసిన యజమానులు తహశీల్దార్ ఆదేశాలను చరవాణిలో సంభాషించి ఈభూమిని వెంటనే ఖాళీచేయాలని ఆదేశాలు జారీచేశారు. చిట్టత్తూరు రెవెన్యూ లెక్క దాఖలా సర్వేనంబర్లు 38లో 7,8,9,14,17లలో 6.71 ఎకరాల భూమి ఆర్డీవో కోర్టులో కేసు నడుస్తుండగా తీర్పువచ్చేంత వరకు ఈభూమిలోకి ఎవ్వరి ప్రవేశించకుండా చూడాలని అలా ప్రవేశిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామ వెంటనే భూమిని ఖాళీ చేయాలస్సిందిగా తహశీల్దార్‌కు సూచనలు ఇచ్చారు.వెంటనే స్పందించిన తహశీల్దార్ హెచ్చరికబోర్డులు ఏర్పాటు చేశారు. తహశీల్దార్ ఆదేశాలను అనుసరిస్తారా అడ్డదిడ్డంగా వ్యవహరిస్తే అక్రమార్కులదే బాధ్యత అని అదేవిధంగా చిట్టత్తూరు రెవెన్యూ లెక్క దాఖల సర్వే నంబర్లలో 38లో 7,8.9,14,17ల్లో ఉన్న 6.71 ఎకరాల భూమి ఆర్డీవో కోర్టులో తీర్పు వచ్చేంత వరకు ఈభూముల్లోకి ఎవ్వరు ప్రవేశించకుండా చూడాలని అలా ప్రవేశించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడుతాయన్నారు. ఆక్రమిత భూముల్లో ప్రవేశిస్తే రియల్టర్లు, అక్రమార్కులను జైలుకు పంపుతామని హెచ్చరించారు.

## రీ సర్వే పరిష్కారానికి వచ్చిన అధికారులకు బెదిరిపులు

–లంచం తీసుకుంటున్నావని బెదిరింపులు

–అధికారులపై తిరుగబడ్డ రైతులు



.తొట్టంబేడు, ఏప్రిల్ 27 ప్రభాతవార్త

పిజిఆర్ఎస్ పిర్యాదుపై రీసర్వే చేయడానికి విచ్చేసిన టాస్క్‌ఫోర్స్ సర్వేయర్ వి.రాంప్రసాద్, మండల సర్వేయర్ హరనాధ్‌లు శ్రీకృష్ణాపురంలో ఉన్న పొలంను సర్వేయాలని పిజిఆర్ఎస్‌లో టిపిటి 202503246368 దామోదర్‌రెడ్డి పిర్యాదు చేశారు దీంతో సమస్యను పరిష్కరించడానికి వచ్చిన అధికారులు ఇక్కడకు చేదు అనుభవం ఎదురైంది. అధికారులు లంచాలు తీసుకుంటున్నారని పేర్కొంటూ తాము మంత్రి నారాలోకేష్‌కు పిర్యాదు చేస్తామని తెలియజేయడంతో వారు వెనుదిరగాల్సిన పిరిస్థితి ఎదురైంది. వివరాల్లోకివెళితే కంచనపల్లి గ్రామంకుచెందిన దగ్గోలు దామోదర్‌రెడ్డి తన పొలాన్ని సర్వేచేయించి చూపించాలని కోరారు. ఇతనికి 4.20ఎకరాలు భూమి ఉండగా మాజీ ఎంపిపి కోవి చంద్రయ్యనాయుడు, కుటుంబసభ్యులపేరుపై బ్లాక్ నంబర్ 100లో 15.35ఎకరాలు ఉంది. అయితే దామోదర్‌రెడ్డి బోనుపల్లికి వెళ్ళేమార్గంలో ఉన్న భూములు తమవేనంటూ పిర్యాదు చేశారు. అయితే ఇక్కడ మట్టిని తొలగించడంతోపాటు తాము ఎలా సాగుచేసుకోవాలో తెలియడం లేదని పేర్కొన్నారు. వీరు సాగుచేసుకుంటున్న పొలంలో ఏఒక్కరికి పట్టాలు కానీ, ఎఫ్ఎంబి స్కెచ్‌లు లేవని తెలిపారు. ముందు ఒప్పుకున్నా తర్వాత తనకు సంబందం లేదని తన భూమి తనకు చూపీయాలంటూ పట్టుబట్టారు. అధికారులు ఎంతచెప్పినా వినకపోవడంతో ఉదయం 10గంటలకు అక్కడకు చేరిన వారు రాత్రి 8గంటల వరకు ఇక్కడే ఉన్నారు. రైతులే అధికారులను బెదిరిస్తుంటే తాము ఏం ఉద్యోగం చేయాలో తెలియడం లేదన్నారు. ఇరు వర్గాలు మధ్య దామోదర్‌రెడ్డి తొలుత ఒప్పుకున్నా తర్వాత అడ్డం తిరిగాడు. అయితే మాజీ ఎంపిపి కోవిచంద్రయ్యనాయుడు మాత్రం వారికి భూమి వారికి కేటాయించడానికి తనకు ఎలాంటి అభ్యంతరం లేదన్నా దామోదర్‌రెడ్డి ఒప్పుకోకపోవడంతో వెనుదిరిగారు. దీంతో చేసేదేమీ లేక కార్యాలయానికి చేరుకుని వారి వద్ద స్టేట్‌మెంట్ రికార్డు నమోదు చేసుకుని ఉన్నతాధికులకు పంపుతున్నామన్నారు. రీసర్వేలో సర్వేయర్ హరనాథ్, సచివాలయ సర్వేయర్ మహేష్, రాఘవ తదితరులు పాల్గొన్నారు

## వేసవిలోను అన్నదాతలు సాగుకుసమాయత్తం

తొట్టంబేడు, ఏప్రిల్ 27 ప్రభాతవార్త



జిల్లాలోని తూర్పు మండలాలు వ్యవసాయక ప్రధాన ప్రాంతాలుగా ప్రసిద్ది చెందాయి. ఇక్కడ వ్యసాయంపై ఆధారపడి రైతు కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. జిల్లాలోని ఇతర ప్రాంతాల పరిస్ధితి ఎలా ఉన్నా శ్రీకాళహస్తి సత్యవేడు నియోజకవర్గాల్లో రెండు పంటలు తప్పని సరిగా పండిస్తారు. మూడవ పంటను కూడా కొన్ని ప్రాంతాల్లో ముందస్తు రబీగా పండించటం ఆనవాయితి.ఈ నేపధ్యంలో రబీ సీజన్ పూర్తి కావటంతో ముందస్తు ఖరీఫ్‌కు సమాయత్తమౌతున్నారు. చెరువుల్లో కొద్ది పాటి నీరు ఉండటం, తెలుగుగంగలో నీటిని విడుదల చేయటంతో రైతులు మెట్టపంటగా వేరుశెనగ పండించటటానికి సమాయత్తమౌతున్నారు. బోర్లు, బావుల నీరు సదుపాయం ఉన్న రైతులు అప్పుడే వేరుశెనగ వేస్తున్నారు.

అన్నదాతలు సాగుకు సమాయత్తమవుతున్నారు. నిన్నమొన్నటి వరకు తాము పండించిన వరి, వేరుశనగ, చెరకు పంటలు చేతిరావడంతో నేలతల్లిని దుక్కిదున్ని సాగుకు సిద్ధమయ్యారు. ఈనేపధ్యంలో వేసవిలో వేరుశనగ పంటను వేసేందుకు సిద్ధమవుతున్నారు. సాధారణంగా రబీ, ఖరీఫ్‌లోసాగుచేస్తారు. ప్రస్తుతం వేసవిలో పంటలు వేసేందుకు సిద్ధమవుతున్నారు. మండలంలోని కొణతనేరి ఇలగనూరు, శేషమనాయుడుకండ్రిగ, చిన్నకన్నలి, చిట్టత్తూరు ప్రాంతాల్లో వేరుశనగ పంటను వేసేందుకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు. దీంతో గత వారం రోజుల నుంచి కొణతనేరి రైతులు దుక్కులు దున్ని వేరుశనగ విత్తనాలను వేస్తున్నారు. ఈసీజన్‌లో వేరుశనగ పంట సుమారు 400 హెక్టార్లు వరకు సాగుచేయడం జరుగుతుంది. అన్నదాతలకు సాగునీరందించేందుకు ఉన్న తెలుగుగంగ కాలువ ప్రస్తుతం ఎండిపోవడంతో కాలువలోచుక్కనీరు కూడా లేకుండా పోయింది. అయితే ఇటీవలే నీరు కాస్తా కాలువలోకి వదలడంతో కాలువలో నీరు ప్రవహిస్తోంది బోర్లు, బావులకింద సాగుచేసే రైతులకు విద్యుత్ సమస్య. ఎప్పుడు విద్యుత్ ఇస్తారో తెలియని పరిస్ధితి. రాత్రివేళ్లలో సైతం పంటపొలాల్లో నిద్రచేయాల్సిన దుస్థితి కలుగుతోంది. రైతులు పండించిన వేరుశనగ పంట 40కేజీలకు రూ.1700 నుంచి రూ.2,100 వరకు ధర పలుకుతోంది. కొందరు రైతులు ఇతర ప్రాంతాల నుంచి విత్తనకాయలను తీసుకువచ్చి సాగుకు సమాయత్తమవుతున్నారు. గతంలో తెలుగుగంగ కాలువనుంచి నీరందిన చెరువుల్లో ఓమోస్తారుగా నీరుంది. ప్రస్తుతం ఈనీరు సాగుకు ఉపయోగపడుతుంది. తిరిగి రబీసాగుకు ఎలా సిద్ధమవ్వాలో అర్థం కావడం లేదంటూ రైతులుపేర్కొంటున్నారు.

**రైతులకుసూచనలిస్తాం..ఎఓ**

మ ండలంలో వ్యవసాయానికి సిద్ధమవుతున్న అన్నదాతలకు సూచనలిస్తామని మండల వ్యవసాయాధికారి సురేంద్ర రెడ్డి అన్నారు. ఈసందర్భంగా ఆయన 'ప్రభాతవార్త'తో మాట్లాడుతూ ప్రతి ఒక్క అన్నదాత విత్తనశుద్ధిని చేసుకుంటే మంచిదన్నారు. ప్రతిరైతు సలహాలను తీసుకుని పంటలను సాగుచేయాలని కోరారు. అంతేకాకుండా రసాయనిక ఎరువులు మోతాదును తగ్గించి సేంద్రీయ ఎరువుల వాడకంపై దృష్టిసారించినట్లయితే అధికదిగుబడులు సాధించవచ్చన్నారు. ఒక్క వరి, వేరుశనగ పంటలేకాకుండా ఉద్యానవన పంటలు కూడా సాగుచేస్తే అధికలాభాలు సాధించవచ్చన్నారు. ఉద్యానవన పంటల్లో సబ్సిడీ కూడా ఉంటుందని తెలిపారు.

## నేడు పలమనేరులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

చిత్తూరు, ఏప్రిల్ 27 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి పలమనేరులోని మున్సిపల్ కార్యాలయపు సమావేశ భవనంలో సోమవారం ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. పలమనేరు డివిజన్ పరిధిలోని ప్రజల సమస్యలను పరిశీలించి పరిష్కరించడానికి ప్రత్యేకంగా సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పలమనేరు రెవెన్యూ డివిజన్ పరిధిలో సోమవారం ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తుండటంతో జిల్లా కేంద్రం చిత్తూరులో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంను రద్దు చేశామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తనతో పాటు జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, జిల్లా అధికారులు పాల్గొని ప్రజల నుండి సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించి వాటిని పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందన్నారు.

## నేడు పోలీస్ స్పందన

చిత్తూరు, ఏప్రిల్ 27 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిశీలించి పరిష్కరించడానికి జిల్లా పాత పోలీసు కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు ఎస్పీ మణికంఠ చందోలు ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగనుంది. ఈ కార్యక్రమాలు ప్రజలు హాజరై ఎస్పీ మణికంఠ చందోలు దృష్టికి సమస్యలు తీసుకెళ్ళి అక్కడికక్కడే పరిష్కరించుకోవచ్చును.

## ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం-కాపరు వైరు చోరీ

పెనుమూరు, ఏప్రిల్ 27 ప్రభాతవార్త:

మండల పరిధిలోని గుడియాన్యంపల్లి సమీప వ్యవసాయ పొలాల్లో గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులో వున్న కాపర్ వైరును చోరీ చేసుకెళ్ళారు. వివరాలిలా వున్నాయి. గుద్యానంపల్లికి చెందిన రైతులు కృష్ణారెడ్డి, రాజారెడ్డి, రఘునాధరెడ్డి వ్యవసాయ సర్వీసులకు కలిపి ట్రాన్స్‌కో అధికారులు ఒక ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మన్‌ను కిందికి దించి దానిని పగులగొట్టి అందులో వున్న కాపర్ వైరును చోరీ చేసి తీసుకెళ్ళారు. ఈ మేరకు రైతులు, ట్రాన్స్‌కో ఎఇ తులసీప్రసాద్ కలసి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## మూడు రోడ్ల కూడలిలో శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం ప్రతిష్టిస్తాం



సోమల, ఏప్రిల్ 27, ప్రభాతవార్త

సోమల మూడు రోడ్ల కూడలిలో బలిజ సంఘం ఆధ్వ ర్యంలో శ్రీకృష్ణదేవరాయల విగ్రహం ప్రతిష్టించేందుకు సన్నాహాలు ప్రారంభించారు. ఆదివారం పరుస వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద పలువురు బలిజ సంఘ సభ్యులు సమావేశం అయ్యారు. మే 4వ తేదీ మరో మారు సమావేశమై కార్యాచరణ ప్రకటిస్తామని సభ్యులు తెలియజేశారు. ఇందుకోసం స్వచ్ఛందంగా ఇచ్చే విరాళాలు స్వీకరించి వాటిని సద్వినియోగం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## మే 1 నుంచి వేసవి క్రీడా శిక్షణా శిబిరం ప్రారంభం

- డిఎస్ఏ సయ్యద్ అహ్మద్

తిరుపతి క్రీడ, ఏప్రిల్ 27, ప్రభాతవార్త

తిరుపతి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో మే 1 నుండి 31 వరకు వేసవి క్రీడా శిక్షణా శిబిరం జిల్లా వ్యాప్తంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డిఎస్ఏ సయ్యద్ అహ్మద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో 25 చొప్పున 50 శిక్షణ శిబిరంలు గుర్తించామన్నారు. హాకీ కోచ్ శ్రీ లక్ష్మికరుణచే ఎస్‌వి ఆర్ట్స్ కళాశాల తిరుపతి, ఫుట్ బాల్ కోచ్ వినోద్ ఎస్‌వి ఆర్ట్స్ కళాశాల తిరుపతి, టెన్నిస్ శశిధర్ శ్రీశ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ నందు, బ్యాడ్మింటిన్ కోచ్ నాగరాజుచే, స్విమింగ్ కోచ్ బి. చక్రవర్తిచే, కుస్తీ కోచ్ హిందుజా, స్కేటింగ్ కోచ్ విజి ప్రేమ్‌నాథ్ చే, కుస్తీ కోచ్ సాయి సుమతిచే జడ్పిహెచ్ఎస్ తిరుచానూరు, వాలీబాల్ కోచ్ యహజాజ్ ఎస్‌పిజెఎన్ఎం స్కూల్ తిరుపతి, హాకీ కోచ్ అశోక్ రెడ్డి జిహెచ్ఎస్ బాయ్స్ చంద్రగిరి, హాకీ కోచ్ దీపక్ ఆకాశ్‌చే అల్లూరి ఆదిశేషారెడ్డి స్టేడియం గూడూరు నందు, బ్యాడ్మింటన్ కోచ్ మందనానిచే కెవికె శ్రీకాళహస్తి నందు శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

### భక్తుల కోసం రెడ్ తివాచీలు..

## దర్జాగా కార్లు పార్కింగ్

### పట్టించుకోని సెక్యూరిటి సిబ్బంది




శ్రీకాళహస్తి,ఏప్రిల్ 27 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి వస్తున్న భక్తులు ఎండకు తేరువీధి,సన్నిధి వీధుల్లో ఎండకు కాళ్ళు కాల్చుకుంటూ ఇబ్బంది పడటం చూసిన ఆలయకార్యనిర్వహణాధికారి డి.బాపిరెడ్డి మానవతా దృక్పథంతో మొదటి దశలో సన్నిధివీదిలోని రామమందిరం నుంచి నాల్గవ గేటు వరకు ఎడమవైపు ఎర్రతివాచిని పరిపించారు. ఖర్చుతో కూడుకున్న పని అయినా భక్తుల కోసం అమలు చేసారు. లక్ష్యం మహోన్నత మైనదే అయితే ఆచరణే ప్రశ్నార్థకంగా మారింది. ఇక్కడకు వచ్చే కార్లుకు పార్కింగ్ స్థలం చాలకపోవటంతో ఆలయానికి సమీపంలోని సన్నిధివీధిలో పార్కింగ్ చేస్తున్నారు. దాంతో ట్రాఫిక్‌కుఅడ్డం లేకుండా ఎడమవైపుపార్కింగ్ చేస్తున్నారు.అయితే ఇక్కడ విధులు నిర్వహించే సెక్యూరిటి వారించాల్సి ఉంది. కానీ మామాట ఎవరు వింటారని సెక్యూరిటి పట్టించుకోవటం లేదు. అంతేకాక సెక్యూరిటి విభాగం అధికార పార్టీ వారికి ఉపాధి కల్పనగా మారింది. అర్హులైన,శిక్షణ పొందిన వారు లేకపోవటంతో వారుఏదో విధజ నిర్వహిస్తున్నామన్నట్లుగానే విధులు నిర్వహిస్తున్నారు. దాంతో ఎర్రటి తివాచి భక్తుల కాళ్ళకు రక్షన కాకుండా కార్లకు మ్యాట్‌గా మారింది. అధికారి మహోన్నత లక్ష్యం ఉద్దేశ్యాన్ని గ్రహించి ఆచరించాల్సిన సిబ్బంది పట్టించుకోక పోవటంతో వృధాగామారింది.ఇప్పటికైనా కార్‌పార్కింగ్‌కు నిర్ణయించిన స్థలంలో మాత్రమే నిలపాలని సెక్యూరిటి సూచించాలి. రోడ్డుపక్కన పార్కింగ్ వల్ల ట్రాఫిక్‌కు కూడా ఇబ్బందిగా మారింది.

## శ్రీ సెల్వ వినాయక స్వామి దేవాలయం మహా కుంభాభిషేకం



పుత్తూరు రూరల్, ఏప్రిల్ 27 ప్రభాతవార్త:

పుత్తూరు పట్టణంలోని పిల్లారిగుడి వీధి, తేరు సమీపం(బజారు వీధి)లో వెలసిన శ్రీ సెల్వ వినాయకస్వామి దేవాలయం మహా కుంభాభిషేకం మే 2వ తేదీ శుక్రవారం నుంచి 4 తేదీ ఆదివారం వరకు మూడు రోజుల పాటు మహా కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు శ్రీ సెల్వ వినాయకస్వామి దేవాలయం వారు ఓ ప్రకటనలో తెలిపారు. 4వ తేదీ ఆదివారం ఉదయం పూర్ణాహుతి, తదుపరి శ్రీ గణపతికి సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామివార్లకు మహా కుంభాభిషేకం అనంతరం 10 గంటలకు మహాభిషేకం, తీర్థ ప్రసాద వినియోగం మధ్యాహ్నం అన్నదానం, రాత్రి 7 గంటలకు శ్రీ సెల్వ వినాయక స్వామి, శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఆనందమయం గంగమ్మ దివ్య దర్శనం

-వసతుల కల్పనలో అధికారగనం

బోయకొండ(చౌడేపల్లి), ఏప్రిల్ 27 ప్రభాతవార్త




శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయం భక్తుల తో కిటకిటలాడింది. ఆదివారం అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని రాష్ట్రంతో పాటు కర్నాటక, తెలంగాణా, తమిళనాడుల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి ముడుపులు చెల్లించుకొన్నారు. కొండదినం కావడంతో అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఉదయం నుంచి ఆలయంలో క్యూలైన్లన్నీ భక్తులతో నిండిపోయాయి. ఆలయ ఇఒ, ఉపకమీషనర్ ఏకాంబరం వేసవిని దృష్టిలో వుంచుకొని భక్తులకు మౌళిక వసతులు కల్పించారు. చలువ పందిళ్ళు, మంచినీటి వసతి వంటివాటిపై ప్రత్యేక శ్రద్ధ వహించారు. సామాన్య భక్తులకు సైతం అమ్మవారి శీఘ్ర దర్శనం అయ్యేలా చర్యలు తీసుకొన్నారు.

## పూర్వపు విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



మేకలచిన్నేపల్లి(చౌడేపల్లి), ఏప్రిల్ 27 ప్రభాతవార్త

మండలంలోని శెట్టిపేట పంచాయతీ మేకలచిన్నేపల్లి ఉన్నతపాఠశాల పూర్వపు విద్యార్థులు(2003-04) అపూర్వ సమ్మేళనం జరిగింది. తాము ఆడిపాడిన పాఠశాలలో చిన్నతనం గురించి తలచుకొని అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొన్నారు. అందరి అభివృద్ధికి కారణమైన పాఠశాలకు తమ వంతు సాయం చేయాలనే ప్రణాళికలు రూపొందించారు. వివిధ ప్రాంతాల్లో స్థిర నివాసం చేసుకొన్నవారు 21సంవత్సరాల తర్వాత కలసుకొని కష్ట, సుఖాలను పంచుకొన్నారు. సహపంక్తి భోజనాలు చేసి, పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. పాఠశాల పూర్వపు(2003-04) విద్యార్థులు పాల్గొన్నారు.

## యాత్రీకుల దాహార్తిని తీర్చే బోరు పరికరాలు వితరణ

బోయకొండ(చౌడేపల్లి), ఏప్రిల్ 27 ప్రభాతవార్త



శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయానికి తరలి వచ్చే యాత్రీకుల దాహార్తిని తీర్చేందుకు ఓ దాత బోరుకు అమర్చే మోటారు తదితర పరికరాలను విరాళంగా అందించారు. కొండకింద వున్న బోరుకు రామ గుండహళ్ళి బెంగళూరుకు చెందిన చిక్కకెంపన్న, ప్రకాష్, గజేంద్ర, మల్లికార్జునలు రూ. 2.50లక్షల విలువ చేయు మోటారు, పైపులు, స్టార్టరు, కేబుల్ వైరు తదితరాలనందించారు. అనంతరం బోరుకు అమర్చి భక్తులకు దాహార్తిని తీర్చారు. ఇఒ, ఉప కమీషనర్ ఏకాంబరం వారికి అమ్మవారి దర్శనభాగ్యం కల్పించి, పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు. ఆలయ అర్చక, అధికార, సిబ్బంది పాల్గొన్నారు.



## ఆపరేషన్లకు 30 మంది ఎంపిక

సదుం, ఏప్రిల్ 27, ప్రభాతవార్త

సదంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 30 మంది చికిత్సలకు ఎంపికయ్యారు. ఉదయం ఈ శిబిరాన్ని సుబ్రమణ్య స్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా తిరుపతి అరవింద్ కంటి ఆసుపత్రి వైద్య బృందం 200 మందిని పరీక్షించి 30 మందిని ఎంపిక చేశారు. వీరిని తిరుపతి కంటి ఆసుపత్రికి తరలించారు. వీరికి సోమవారం శస్త్ర చికిత్స చేసి తిరిగి సదంలో విడిచిపెట్టనున్నట్లు వారు చెప్పారు. సదుం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్సిసి బాలికల విద్యార్థులు రోగులకు సేవలందించారు. సదం ప్రభుత్వ వైద్యశాల కంటి వైద్యులు నరసింహులు, సీతారామయ్య, వేణు,ఉపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

రొంపిచెర్ల, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:



బండ కింద పల్లి పంచాయతీలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన తిరుపతి మదనపల్లి జాతీయ రహదారిలోని నేషనల్ హైవేకు సమీపంలోని రొంపిచెర్ల పీలేరు మండలాల సరిహద్దుల్లో ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. బండకింద పల్లి గ్రామపంచాయతీలోని బడబళ్ల వంక వద్ద రోడ్డు పక్కన సుమారు (45) సంవత్సరాల వయసు గల వ్యక్తిగా గుర్తించారు. ఆయన గత మూడు రోజులుగా కమ్మోళ్ళ పల్లె పక్కన ఉన్న రామానాయాక్ తాండా ఎర్రగుంట్ల పల్లి మధ్య తిరుగుతున్నాడని గ్రామస్తులు తెలిపారు. ఒక డ్రాయర్ మాత్రమే వేసుకొని బట్టలు లేకుండా తిరుగుతున్నాడని అన్నారు. పీలేరు మండలం రామానాయక్ తండా నుంచి రోడ్డు పక్కకు వచ్చి మృతి చెంది ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో రోడ్డు మీద వెళ్తున్న బాటసారులు రొంపిచెర్ల పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్ఐ సుబ్బారెడ్డి సంఘటన స్థలాన్ని సందర్శించి వివరాలను గ్రామస్థులకు అడిగి తెలుసుకున్నారు. మృతదేహం ఎడమ చేతి పై చున్నక్ రాజ్ అనే పచ్చ బొట్టుతో పేరు రాసుకున్నారని అన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, శవాన్ని పోస్టుమార్టం కోసం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ శవం ఆచూకి తెలిపిన వారు రొంపిచెర్ల పోలీసులు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ సుబ్బారెడ్డి కోరారు.

## అపరిచిత వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు



పుంగనూరు, ఏప్రిల్ 27, ప్రభాతవార్త

తమ వీధిలో నిత్యం కొంతమంది అపరిచిత పురుషులు సంతరిస్తూ మహిళలపై దాడులు దిగబడు తున్నారని ఏవి రావు వీధి మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బ్రాహ్మణవీధికి వెనుక ఉన్న ఆర్కాట్ వెంకోబరావు వీధిలో అపరిచితుల తాకిడి ఎక్కువైంది. ఆదివారం ఈ వీధిలో ఓమహిళ పట్ల కొంతమంది వ్యక్తులు అభ్యంతరమైన దూషణలతో దాడులకు తెగబడ్డారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం తెలిపారు. ఘటన స్థలానికి సిఐ సుబ్బరాయుడు ఎస్సై లోకేష్ పోలీస్ సిబ్బంది చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏవి రావి రావు వీధి మహిళలు మాట్లాడుతూ,తమ వీధిలో ఓ ఇంటికి అధిక సంఖ్యలో పురుషులు వచ్చిపోతుంటారని అన్నారు. ఆ ఇంటికి వచ్చే వ్యక్తులు వీధిలో ఉన్న మహిళల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. దీనిపై చర్యలు తీసుకుంటామని సిఐ సుబ్బరాయుడు తెలిపారు.

## పేద ప్రజల కోసమే ఉచిత వైద్యశిబిరాలు

బిఆర్‌డి ఆస్పత్రి ఛైర్మన్ డా॥బిఆర్ సురేష్‌బాబు




కుప్పం, ఏప్రిల్ 27 ప్రభాతవార్త

పేద ప్రజల ఆరోగ్యం కోసమే తమ ఆస్పత్రి తరపున ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కుప్పం బిఆర్‌డి ఆస్పత్రి ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. ఆదివారం బెంగళూరు వైదేహి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, కుప్పం లయన్స్ క్లబ్ వారి సహకారంతో బిఆర్‌డి ఆస్పత్రిలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంకు విశేష స్పందన లభించింది. ఉచితంగా కార్డియాలజీ, న్యూరాలజీ, మెడికల్ ఆంకాలజీ విభాగాల్లో సుమారు 106మందికి వైద్య పరీక్షలు నిర్వహించి వారిలో 40మందిని ఆపరేషన్లు, మెరుగైన వైద్యం కోసం ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. రోగులకు ఉచితంగా బిపి, చక్కెర వ్యాధి పరీక్షలు, ఇసిజి, 2డి ఎకో వ ంటి పరీక్షలు చేశామన్నారు. కార్యక్రమంలో కార్డియాలజిస్ట్ డా॥ కమల్ సభా, న్యూరాలజిస్ట్ డా॥ అళగరాజ్, ఆంకాలజిస్ట్ డా॥ సింధు, లయన్స్ క్లబ్ బృందం మహేష్, పిజి సెల్వం, కృష్ణమూర్తి, లెనిన్, పిఆర్వో లోకేష్, శ్రీనివాసమణి పాల్గొన్నారు.

## సత్యవేడులో జూన్ 11న గంగజాతర

సత్యవేడు, ఏప్రిల్ 27 ప్రభాతవార్త:



సత్యవేడు పట్టణంలో జూన్ 11,12 తేదీల్లో గంగజాతర నిర్వహించడానికి జాతర నిర్వాహకులు కమిటీ తుది నిర్ణయం తీసుకున్నారు. ఆదివారం స్థానిక కల్యాణ వీరభద్ర స్వామి ఆలయ ప్రాంగణంలోనిర్వాహకులు, గ్రామకుల పెద్దల కమిటీ సమావేశం జరిగింది. ఇందులో గోపినాథ్, సోమయ్యశెట్టి, ప్రసాద్‌రెడ్డి, విజయ్‌నాయుడు, సదమయ్య, కోదండరెడ్డి, దిలీప్, రాజేష్, మురళి, శివ తదితరులు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో గంగజాతర నిర్వహణపై నిర్వాహకులు చర్చించారు. గత జాతర జమ ఖర్చులపై చర్చించారు. ఈ క్రమంలో 2025 మే 28వ తేదీన గంగజాతరకు సంబంధించి పట్టణంలో తొలి చాటింపు వేస్తారు. జూన్ 4న రెండో చాటింపు ఉంటుందన్నారు. చాటింపు రోజున గంగమిట్ట వద్ద అమ్మవారికి భక్తులు పెద్ద ఎత్తున అంబళ్లు పోసి పూజలు నిర్వహిస్తారు. అలాగే అదే రోజు సదవాలమ్మ అమ్మవారికి పొంగళ్లు పెట్టినైవేద్యం సమర్పిస్తారు. రాత్రి కలశ ఊరేగింపు ఉంటుందని పేర్కొన్నారు. తదుపరి జూన్ 11,12 తేదీల్లో బుధ, గురువారాల్లో రెండు రోజులు పాటు గంగజాతర వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

## యువతకు స్ఫూర్తి సుబ్రహ్మణ్యం రెడ్డి

వడమాలపేట, ఏప్రిల్ 27 ప్రభాతవార్త:



యువతకు స్ఫూర్తి ప్రధాత డాక్టర్ బి.సుబ్రహ్మణ్యంరెడ్డి నెహ్రూ యువజన సేవా సంఘం అధ్యక్షురాలు జ్యోతి లక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం వడమాలపేట మండలం ఎస్వీ పురంలో నెహ్రూ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో సేవాభారతి సంస్థ అధ్యక్షులు సుబ్రహ్మణ్యంరెడ్డి సంతాప సభను నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సుబ్రహ్మణ్యంరెడ్డి కుమారుడు నరేంద్రకుమార్ మట్లాడుతూ తన తండ్రి ఆశయ సాధనకు గ్రామీణ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు బట్టలు పంపిణీ చేశారు. రాష్ట్ర యువజన అవార్డు గ్రహిత వెంకమరాజు, సంఘ సభ్యులు మురళి, లోకేష్, నాగభూషణం రాజు, నాధముని, చంద్రశేఖర్‌రాజు, మీరయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కిషోర్ పాల్గొన్నారు.

## అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు నాగరాజు

వడమాలపేట, ఏప్రిల్ 27 ప్రభాతవార్త:

ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘంవడమాలపేట అధ్యక్షులు8గా పి.నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం వడమాలపేటలో అంబేద్కర్ యువజన సంగం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులు కె.లోకనాథం, కార్యదర్శిగా వై.మస్తాన్, కోశాధికారిగా ఎన్.గణేష్‌కుమార్‌లను నియమించారు. జిల్లా నాయకులు, అడ్వయిజర్ కమిటీ ఛైర్మన్ డేవిడ్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఉచిత వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభం

తిరుపతి విద్య ఏప్రిల్ 27 ప్రభాతవార్త

స్థానిక అన్నమయ్య సర్కిల్లోని గ్రేడ్ 1 గ్రంథాలయంలో వేసవి సెలవులు సందర్భంగా ప్రతి ఏడాది లానే ఈ సంవత్సరం కూడా హై స్కూలు విద్యార్థిని విద్యార్థులలో సృజనాత్మకతను ప్రోత్సహించడానికి ప్రత్యేకంగా ఉచిత వేసవి విజ్ఞాన శిబిరం ఈ నెల 28 నుంచి జూన్ 6 వరకు నిర్వహిస్తున్నట్లు గ్రేడ్1 గ్రంథాలయధికారి జె.శివ ప్రసాద్ తెలిపారు.ప్రతి రోజు ఉదయం 8 నుండి 11 గం,వరకు ఈ ఉచిత వేసవి శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో వివిధ విషయాల్లో శిక్షణలు స్పోకెన్ ఇంగ్లీషు,ఇంగ్లీషు గ్రామర్,కథలు వినుట, పుస్తక పఠనము,పుస్తక సమీక్షలు,పెద్దల నుంచి విన్న అముద్రిత కథలు చెప్పుట,చిత్రలేఖనము,పెయింటింగ్,పేపర్ క్రాఫ్ట్, ఆర్ట్ వంటి సృజనాత్మక అంశాలలో ఉచితముగా శిక్షణ ఇవ్వబడునని, ఉచితముగా శిక్షణ ఇచ్చేందుకు ఆసక్తిగల రిసోర్స్ పర్సన్స్ ఎవరైనా వుంటే సెల్ నెంబర్ 9912189869 సంప్రదించవలసినదిగా కోరారు.

## తిరుమలలో మాయమైన బాలుడు మల్లవరంలో ప్రత్యక్షం

రేణిగుంట ఏప్రిల్ 27 ప్రభాతవార్త



కర్ణాటక రాష్ట్రానికి చెందిన మైనర్ బాలుడు శ్రీనివాస్ (16) తిరుమలలో మాయమై రేణిగుంట మండలం మల్లవరం గ్రామం నందు ఆదివారం ప్రత్యక్షమయ్యారు. ఎవరో 16 సంవత్సరాల మూగ చెవిటి బాలుడు రేణిగుంట మండలం మల్లవరం గ్రామంలో తిరుగుతున్నాడని స్థానికులు గుర్తించి పోలీసులకు అప్పగించారు. అర్బన్ సీఐ శరత్ చంద్ ఆదేశాలతో అర్బన్ ఎస్సై అరుణ్ కుమార్ రెడ్డి సీసీటిఎన్ఎస్ ద్వారా బాలుని ఆచూకీ కోసం సమాచారాన్ని సేకరించారు. సదరు బాలుడు కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా లింగ సరుగు తాలూకా ముద్గల్ గ్రామానికి చెందిన కృష్ణప్ప కుమారునిగా గుర్తించారు. తిరుమల టూ టౌన్ పోలీస్ స్టేషన్లో మిస్సింగ్ కేసు నమోదైనట్లు నిర్ధారించారు. బాలుని కుటుంబ సభ్యులకు అప్పగించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. పోలీసులకు సహాయపడి బాలుడిని తల్లితండ్రులకు అప్పగించేందుకు కృషిచేసిన ప్రజలను పోలీసులు అభినందించారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

కేవీబీ పురం, ఏప్రిల్ 27 ప్రభాతవార్త:



కేవీబీ పురం మండలకేంద్రంలో జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో ఆదివారం రష్ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వారు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా రష్ ఆస్పత్రి వారు జనరల్‌మెడిసిన్, ఆర్థోపెడిక్, పల్మనాలజీ, కిడ్నీ, గ్యాస్ట్రిక్ సమస్యలు గురించి చూడడం, లేజర్ ట్రీట్‌మెంట్ వంటి అత్యధునిక సాంకేతిక ఆపరేషన్ల గురించి అందరికి తెలియజేశారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు మెరుగైన వైద్యం అందిస్తూ రష్ ఆస్పత్రి ఎప్పుడు ప్రజలకు వైద్యం అందించేందుకు అండగా నిలుస్తుందని రష్ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అధినేత డా. సిపాయి సుబ్రహ్మణ్యం వెల్లడించారు. అలాగే వైద్య శిబిరాన్ని విజయవంతం చేసిన కేవీబీ పురం మండల ప్రజలకు, వైద్య శిబిరంలో పాల్గొన్న ప్రముఖ ఎండీ ఎం.కిషోర్, డా. కె.శివజ్యోతి, పీఆర్‌వో సుబ్రహ్మణ్యం, సుమతి, మీనాకుమారి, జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.వెంకటకృష్ణయ్యకు అలాగే సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేశారు. 150 మంది ఓపీకి హాజరైతే అందులో 124 మంది రెఫర్ చేయడం జరిగిందని వైద్య సిబ్బంది తెలిపారు. రోగులను పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

## పుత్తూరులో ఉడిపి పీఠాధిపతి వారి పాదయాత్ర

పుత్తూరు రూరల్, ఏప్రిల్ 27 ప్రభాతవార్త:

ఆడమారు మఠం(ఉడిపి) పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ ఈషాప్రియ తీర్థ స్వామిజీ వారు ధర్మ పరిరక్షణలో భాగంగా గోసం రక్షణ, గ్రామీణ చేతి వృతులవారి అభివృద్ధి, రైతులు సంక్షేమం, జానపదుల కళల అభివృద్ధి కొరకు పాదయాత్రను సంకల్పించారు. స్వామివారి పాదయాత్ర సుమారుగా 220 కి.మీ షోలింగర్, తమిళనాడు షోలింగర్ నుంచి ఆంధ్రప్రదేశ్ నెల్లూరు వరకు ఉంటుంది. స్వామివారి ఉడిపి నుంచి 26న తమిళనాడు షోలింగర్‌లోని ఆడమారు మఠం చేరుకుని 27న బ్రహ్మ ముహూర్తం ఉదయం 4 గంటలకు పాదయాత్రగా బయలుదేరి 30న సాయంత్రం 4 గంటలకు తడుకు గ్రామం పొలిమేరలలో రామారావు పాదయాత్రికులకు, సాధు సత్పురుషులకు నిర్మించనున్న ఆశ్రమం వద్ద గోశాలకు భూమిపూజ చేస్తారు. రాత్రికి రేణిగుంట చేరుకుంటారు. తిరుగు ప్రయాణంలో శ్రీకాళహస్తి, తిరుపతి, నారాయణవనం, మరికొన్ని క్షేత్రాలు సందర్శించి తిరిగి ఉడిపి మఠానికి చేరుకుంటారు.

## సారూ...ఓవర్‌హెడ్ ట్యాంకు మరమ్మతు బిల్లులు చెల్లించండి

ఏడేళ్లుగా ఎదురు చూస్తున్న కాంట్రాక్టర్లు

విజయపురం, ఏప్రిల్ 27 ప్రభాతవార్త:



సారూ మేము ఓవర్‌హెడ్ ట్యాంకు మరమ్మతు చేసినందుకు బిల్లులు చెల్లించండని కాంట్రాక్టర్లు అధికారులను వేడుకుంటున్నారు. 2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలో మండలంలోని పన్నూరు దళితవాడ ఓవర్‌హెడ్ ట్యాంకు రూ.2,02,674లు, ముత్యాలరెడ్డి కండ్రిగ ఓవర్‌హెడ్ ట్యాంకు రూ.2,73,088, బూచివానత్తం ఓవర్‌హెడ్ ట్యాంకు రూ.59,973లు, విజయపురం అరుంధతివాడ ఓవర్‌హెడ్ ట్యాంకు రూ.1,73,871లు, ఎగువ మహవీరపురం ఓవర్‌హెడ్‌ట్యాంకు రూ.1,78,974లు, కాళికాపురం బీసీ కాలనీ ఓవర్‌హెడ్ ట్యాంకు రూ.1,71,640లు, నారపరాజుకండ్రిగ ఓవర్‌హెడ్ ట్యాంకు రూ.2,53,779లు, శ్రీహరిపురం అరుంధతివాడ ఓవర్‌హెడ్‌ట్యాంకు రూ.1,07,408లు, లక్ష్మీవిలాసపురం ఓవర్‌హెడ్‌ట్యాంకు రూ.1,11,365లు మొత్తం రూ.15,32,772లు మంజూరు కావడంతో కాంట్రాక్టర్లు మరమ్మతు పనులు యుద్ధ ప్రాతిపదికన చేశారు. దీంతో పాటు కళియంబాకం, కమ్మకండ్రిగ ఓవర్‌హెడ్ ట్యాంకులకు కూడా మరమ్మతు చేపట్టారు. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలో రావడంతో బిల్లులు ఆపేశారు. దీంతో అప్పులు చేసి పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు బిల్లులు రాక, అప్పులు చెల్లించలేక ఇబ్బంది పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వం బిల్లులు ఆపి వేయడంతో అప్పులు చేసిన కాంట్రాక్టర్లు బాలసుబ్రహ్మణ్యంరాజు, దశరథరాజులు హై కోర్టును ఆశ్రయించారు. హై కోర్టు పిటిషన్ నెం.23351/2023 8.11.2023 తేదీ 6 వారాల్లో బిల్లులు చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. కానీ ప్రభుత్వంలో చలనం లేకుండా పోవడంతో కాంట్రాక్టర్లు, టీడీపీ నేతలు బిల్లుల కోసం 7 సంవత్సరాలు ఎదురు చూస్తూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మాకు బకాయి బిల్లులు ఇచ్చి ఆదుకోవాలని టీడీపీ నాయకులు కోరుతున్నారు.

## డిఎస్‌సి అభ్యర్థుల వయస్సు 47కు పెంచాలి!

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 27 ప్రభాతవార్త

రాష్ట్రంలో ప్రభుత్వం ప్రకటించిన మెగా డిఎస్‌సిలో ప్రభుత్వం పలు వెసులుబాట్లు కల్పించినట్లు పి.శ్రీనివాసులు, రమణయ్య, జి.బాలయ్యలు ఆదివారం తెలిపారు. మాట్లాడుతూ డియస్‌సి నోటిఫికేషన్ 2025 ఓపెన్ కేటగిరిలో డియస్‌సి అభ్యర్థుల వయస్సును 44సంవత్సరాలు గరిష్టపరిమితిగా ఇచ్చారని వివరించారు.గత 7 సంవత్సరాలుగా ప్రభుత్వాలు డియస్‌సి నోటిఫికేషన్ ఇవ్వలేదు. దాంతో చాలా మంది విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారి వయస్సు దాటిందన్నారు. 2018 నుంచి డియస్‌సి నోటిఫికేషన్ కోసం ఎదురు చూసిన వారు ఏ ఏడాదికా ఏడాది ప్రకటనలతో నిరాశ చెందారు. ఇలా ఏడు సంవత్సరాలు వయస్సు మీరి పోతుంది. దయతో నోటిఫికేషన్ జారి చేసిన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.ప్రభుత్వం వయస్సు పరిమితిని 47కు పెంచి నిరుద్యోగులకు అవకాశం కల్పించాలని కోరారు. చాలా మంది అనుభవజ్ఞులైన పిజిటిలు 44 సంవత్సరాల వయస్సు దాటినందున డియస్‌సి కోల్పోతున్నారని వివరించారు.నవోదయ పాఠశాలలు,కేంద్రీయ విద్యాలయాలు ఇఎంఆర్ఎస్ పాఠశాలలో ప్రిన్సిపల్స్ కూడా ఉన్నారు. ప్రిన్సిపల్ నియమకం వయస్సు 35 నుంచి 50 సంవత్సరాలకు పెంచాలని కోరారు.

## సమ్మర్ కంప్యూటర్ కోచింగ్ శిక్షణ

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 27 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలోని ముత్యాలమ్మగుడివీధిలోని ఏడు గంగమ్మల గుడి పక్కన మీసేవ కేంద్రంలోసమ్మర్ కంప్యూటర్ కోచింగ్ ఎసెంటర్‌ను ప్రారంభించనున్నట్లు సూర్యకుమార్ తెలిపారు. ఆదివారం ఈ మేరకు సమాచారాన్ని అందిస్తూ యువకులకు కంప్యూటర్‌లో శిక్షణ ఇవ్వటానికి నిర్ణయించినట్లు తెలిపారు. ఫండమెంటల్ ఆఫ్ కంప్యూటర్ కాలపరిమితి 15రోజులు వెబ్‌డిజైన్ 15రోజుల అతి తక్కువ ధరకే పైకోర్సులు నేర్పించబడుతుందని వివరించారు. ఎంసెట్,ఈ సెట్,పాలిసెట్,జేఇ మెయిన్స్ లలేదా ఏ ఉద్యోగాలు చేయాలన్నా తప్పక కంప్యూటర్ పరిజ్ఞానం కోరుతున్నారన్నారు.కాబట్టి ప్రతి ఒక్కరు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## టూటౌన్ సిఐగా నాగార్జున్‌రెడ్డి

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 27 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి టూటౌన్ సిఐగా నాగార్జున్‌రెడ్డిని నియమించినట్లు సమాచారం. గత ప్రభుత్వ హయాంలో శ్రీకాళహస్తి వన్‌టౌన్ సిఐగా సమర్థవంతంగా పని చేసిన నాగార్జున్‌రెడ్డి ముక్కుసూటిగా పని చేసారు.ఆయన తీరు పాలకులకు నచ్చలేదు.దాంతో ఆయన్ను ఇక్కడ నుంచి పంపించేసి సిఐగా అంజూయాదవ్‌ను సిఐగా తెచ్చుకున్నారు. తరువాత వన్‌టౌన్‌గా సిఐగా కూటమిప్రభుత్వ హాయంలో డి.గోపిని నియమించారు. శ్రీకాళహస్తి పట్టణం పట్ల అవగాహన ఉన్న సిఐ నాగార్జున్‌రెడ్డికి మళ్ళీ శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో పని చేసేభాగ్యం లభించింది. శాంతి భద్రతల పరిరక్షణలో శ్రీకాళహస్తి పట్ల అవగాహన ఉన్న సిఐ నాగార్జున్‌రెడ్డి టూ టౌన్ సిఐగా నియమించారు. కాగా ఏర్పేడు సిఐ జయచంద్రను రేణిగుంటకు ఎస్ఐ శ్రీకాంతరెడ్డిని వీఆర్‌కు పంపారు.అయితే ఏర్పేడు మండల సిఐ,ఎస్ఐలను నియమించలేదు

## పరమేశ్వరుని సేవలో జాయింట్ కలెక్టర్

శ్రీకాళహస్తిరూరల్,ఏప్రిల్ 27 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడు మండ లంలో వెలసిన పరశురామేశ్వరుని సేవలో ఆదివారం తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ కుటుంబసభ్యులతో హాజరై పూజలు జరుపుకున్నారు. పాపానాయుడుపేట నుంచి గుడిమల్లంకు కొత్త రోడ్డు నిర్మాణంలో స్థానిక శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి చొరవ చూపటంతో ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య అతిధుల సంఖ్య పెరుగుతుంది.ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం జాయింట్ కలెక్టర్ కుటుంబసభ్యులతో రాగా వారికి ఆలయ మర్యాదలతో ఇఓ రామచంద్రారెడ్డి, మాజీ ఛైర్మెన్ బత్తల గిరినాయుడులు స్వాగత పలికారు.దర్శనం తరువాత వారికి వేదపండితులతో ఆశీర్వదించారు.

## టపాకాయల గోడౌన్లను పరిశీలించిన పోలీసు అధికారులు

తొట్టంబేడు, ఏప్రిల్ 27 ప్రభాతవార్త



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వేసవి కాలం దృష్టిలో ఉంచుకుని మండుదున్న ఎండలు దృష్ట్యా టపాకాయల దుకాణం యజమానులు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదివారం మండల పరిధిలోని పలు టపాసులు దుకాణాలను ఉమ్మడి తనిఖీల్లో భాగంగా పరిశీలన చేయడం జరిగింది. ఈసందర్భంగా ఉమ్మడి తనిఖీ అధికారులు మాట్లాడుతూ నిబంధనల మేరకు అన్ని రకాలప్రమాద నివారణ చర్యలు టపాసులు దుకాణాల యజమానులు తీసుకోవాలని ఎండలో వేడికి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ప్రభుత్వ నిబంధనలకు లోబడి జాగ్రత్త వహించాలని ప్రభుత్వం నిబంధనలను ఉల్లఘింస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. భద్రతకు సంబందించి అన్ని ఏర్పాట్లు ఎప్పటికప్పుడు సరిచేసుకోవాలని ఏదైనా అనుకోని ప్రమాదాలు సంభవించినపుడు నష్టనివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలుపై అప్రమత్తం చేశారు. నష్ట నివారణకు తీసుకోవాల్సిన ఏర్పాట్లపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి కార్మిక శాఖ అధికారి జి.రంగనాథ్, తొట్టంబేడు డిటి జగన్‌మోహన్,, శ్రీకాళహస్తి అగ్నిమాపకశాఖఅధికారినాగార్జునరెడ్డిమరియు టుటౌన్ స్టేషన్ ఎస్ఐ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు వ్యక్తిగత శుభ్రత పాటించాలి

– డాక్టర్ లావణ్య

రామచంద్రాపురం, ఏప్రిల్ 27 ప్రభాతవార్త :



మహిళలు వ్యక్తిగత శుభ్రతను పాటించాలని డాక్టర్ లావణ్య అన్నారు. ఆది వారం ఏకవీరా సేవా పౌండేషన్ మహిళా విభాగం వారు పిళ్ళారి కోన ఎస్టీ కాలనీలోని మహిళలకు వ్యక్తిగత పరి శుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లావణ్య నెలసరి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం ఆరునెలలకు సరిపడ సానిటరి నాప్కిపిన్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏకవీరా సేవా పౌండేషన్ సభ్యులు దీప, నాగస్వప్న, తేజ, రూప, తదితరులు పాల్గొన్నారు.

## పోలీసులు సేవా భావంతో పనిచేయాలి

– చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్



రామచంద్రాపురం, ఏప్రిల్ 27 ప్రభాతవార్త :

పోలీసులు సేవా భావంతో పనిచేయాలని చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్ అన్నారు. ఆదివారం మిట్టూరు కమ్యూనిటీ హాల్‌లో ఏఎస్ఐ శేఖర్‌రెడ్డి పదవి విరమణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు శాఖలో పాతతరం వారు వజ్రాలు లాంటి వారని కొనియాడారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర ఎనలేనిదన్నారు. అనంతరం ఏఎస్ఐ శేఖర్‌రెడ్డి దంపతులు సీఐ సుబ్బరామిరెడ్డి, ఎస్.ఐలు రామాంజనేయులు, రవీంద్రనాథ్, టీడీపీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి, నాయకులు జనార్ధన్ చౌదరి, కోఠా హరిప్రసాద్, మునిరామిరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డిలతో కలిసి ఘనంగా సన్మానించారు.

# తిరుపతి డివిజన్

## వైభవంగా గంగమ్మజాతర

పోస్టర్లు ఆవిష్కరణలో ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి(రవాణ),ఏప్రిల్ 27ప్రభాతవార్త



వారంరోజులు జరిగే తాతయ్యగుంట గంగమ్మ జాతరను అంగరంగవైభవంగా నిర్వహిస్తామని తిరుపతి ఎంఎల్ఏ ఆరణి శ్రీనివాసులు తెలిపారు. మేనెల 6వతేదీ నుండి 13వరకుజరిగే అమ్మవారి గంగజాతర వాల్‌పోస్టర్లను ఆయన విడుదల చేశారు. భక్తులు రోజుకో వేషంలో అమ్మవారిని దర్శించుకుంటారు. ఎంఎల్ఏ శ్రీనివాసులు, టిడిపి నాయకులు సుగుణమ్మ, పుష్పావతియాదవ్, నరసింహయాదవ్, సదాశివం, ఆర్‌సి మునికృష్ణ, పులుగోరు మురళి, బుల్లెట్‌రమణ, శ్రీదర్‌వర్మ, మబ్బుదేవనారాయణరెడ్డి, ఆవుల ఈశ్వర్‌రెడ్డి, ఆలయ కాంట్రాక్టర్ వంశీకృష్ణ, గంగమ్మఆలయ ఈఓ జయకుమార్ పాల్గొన్నారు. అందరికీ అమ్మవారి దర్శనం చేయించార

## దేశంకోసం అహర్నిశలు శ్రమిద్దాం

–పహల్గామ్ దాడి తీవ్రంగా కలచివేసింది

తిరుపతి(రవాణ),ఏప్రిల్ 27ప్రభాతవార్త



దేశంకోసం అహర్నిశలు శ్రమిద్దామని, కాశ్మీర్ ఫహలామ్‌దాడి తీవ్రంగా కలచివేసిందని ప్రధాని నరేంద్ర మోదీ ఆవేదన చెందారు. మన్‌కీబాత్‌లో ఆదివారం ఉదయం ప్రధాని మోదీ దేశప్రజలనుద్దేశించి మాట్లాడారు. ప్రధాని తన మనసులోని భావాలను పంచుకున్నారు. తిరుపతిలో ఆదివారం ఈ కార్యక్రమాన్ని బిజెపి నాయకులు గుండాల గోపీనాధరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, పగడాల లోకప్రభాకర్‌నాయుడు, మురళి, దీపక్‌రెడ్డి, గురుప్రసాద్, తదితరులు మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు.

## ఆలయాల్లో ఘనంగా అమావాస్య పూజలు

నారాయణవనం, ఏప్రిల్ 27 ప్రభాతవార్త :



మండలంలోని వెంకటకృష్ణాపాలెం పంచాయితీ పరిధి నాగిలేరు శింగిరికోనలో ప్రసిద్ది చెందిన శ్రీదేవి,భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం అమావాస్య పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో శుద్ది, నిత్యకైంకర్య పూజా కార్యక్రమాలను నిర్వహించిన తర్వాత అభిషేకం చేసారు. సుగంధద్రవ్యాలతో అభిషేకం చేసిన తర్వాత పుష్పాలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శనం చేసుకున్నారు. అలాగే నారాయణవనంలో అవదూతగా వెలసిన తాతాసారకాయులస్వామి ఆలయంలోను అమావాస్య పూజలను ఘనంగా జరిపారు. స్వామివారికి అభిషేకం చేసిన తర్వాత పుష్పాలతో సుమనోహరంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన ం నిర్వహించారు.

## కల్యాణవేంకటేశ్వరుని సన్నిధిలో ఘనంగా భాష్యకారుల ఉత్సవాలు

నారాయణవనం, ఏప్రిల్ 27 ప్రభాతవార్త :



నారాయణవనంలోని కల్యాణవెంకటేశ్వరుని ఆలయంలో వెలసిన భాష్యకారుల ఉత్సవాలు ఆదివారం కూడా ఘనంగా సాగింది. ఈ ఉత్సవాలు 10రోజుల పాటు జరుగుతుందని టిటిడి అధికారి నాగరాజు తెలిపారు. అంతకుముందు అమ్మవారిని,స్వామివారిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి, శుద్ధి, పుణ్యవచనం, గంట, అర్చన, బలి, తోమాలసేవ, నిత్యకైంకర్య పూజ కార్యక్రమాల అనంతరం సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. సాయంత్రం తిరుచ్చివాహనంపై అదిరోహించి మాడవీధుల్లో ఊరేగించారు.

## మొరవ భారతంలో అలరించిన దుర్యోధన వధ

వెదురుకుప్పం, ఏప్రిల్ 27 ప్రభాతవార్త :



మండలంలోని తిరుమలయ్యపల్లె పంచాయితీ పరిధిలోగల మొరవ మహాభారతం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం జరిగిన దుర్యోధన వధ పలువురిని అలరించింది. మహాభారత ఇతిహాస గాథలో కురుక్షేత్ర సంగ్రామంలో శత సహోదరులను, సర్వసైన్యంను, బంధువులను, గురువులను అందరిని యుద్ధంలో పోగొట్టుకున్న దుర్యోధనుడు శమంతక మడుగులో దాక్కోవడం జరుగుతుంది. ఈ ఘటనను శ్రీవెంకటేశ్వర నాట్యకళా మండలి కళాకారులు ప్రదర్శించి పలువురి ప్రశంసలు అందుకున్నారు. దుర్యోధన వధ కార్యక్రమంకు ఉభయదాతలుగా బత్తల బాలసుబ్రమణ్యం కుటుంబ సభ్యులు వ్యవహారించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు బోడి రెడ్డి మోహన్ రెడ్డి, తారక్ రెడ్డి, కార్యనిర్వహకులు కృష్ణా రెడ్డి, గోపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి అటానమస్ కళాశాలల్లో డిగ్రీ పరీక్షలు

తిరుపతి విద్య ఏప్రిల్ 27 ప్రభాత

గత ఏడాది అటానమస్ హోదా పొందిన టీటీడీ కళాశాలలో సోమవారం నుంచి డిగ్రీ రెండవ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఎస్వీ ఆర్ట్స్ కళాశాల, పద్మావతి డిగ్రీ అండ్ పీజీ కళాశాల,ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపాళ్ల పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశారు.సుమారు 3 వేల మంది విద్యార్థులు అటానమస్ హోదాలో డిగ్రీ రెండవ సెమిస్టర్ పరీక్షలకు హాజరుకానున్నారు.ఈ పరీక్షలు వచ్చేనెల 6వ తేదీవరకు కొనసాగనున్నాయి.

## తిప్పారెడ్డిని సన్మానిస్తున్న నారాయణ గౌడ్

తిరుపతి విద్య, ఏప్రిల్ 27 ప్రభాతవార్త



స్థానిక మహతి ఆడిటోరియంలో తిరుపతి సిటీ ఛాంబర్ వారు సమాజంలో చేసిన సేవలను గుర్తించి డాక్టర్ అంబేద్కర్ గ్లోబల్ లా ఇన్స్టిట్యూట్ అధినేత ఆర్ తిప్పారెడ్డిని లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డుతో సత్కరించారు.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పర్చూరు నారాయణ గౌడ్ గజమాలతో తిప్పారెడ్డిని సత్కరించారు. గౌడ్ మాట్లాడుతూ తిప్పారెడ్డి కరువు ప్రాంతమైన రాయలసీమలో ముఖ్యంగా తిరుపతి పట్టణంలో 30 సంవత్సరాల క్రితం న్యాయ కళాశాలను స్థాపించి ఎంతోమంది న్యాయమూర్తులు,న్యాయవాదులు,న్యాయ అధికారులను తయారుచేసిన గొప్ప న్యాయ ప్రదాత.నిరుపేద ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ విద్యార్థులకు న్యాయవిద్యను ఉచితముగా అందిస్తున్న విద్యాదాత అన్నారు. ఇటువంటి మానవతావాది ,సమాజ సేవకునికి లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పవన్ కుమార్‌యాదవ్,శ్రీనివాసులు,హరికృష్ణయాదవ్,నాగవర్ధన్,మహేష్,రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## బాబామందిరంలో ఉచిత సమ్మర్ క్యాంప్

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 27 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి ముత్యాలమ్మగుడివీధిలోని సత్యసాయి బాబా సన్నిధానంలో ఆదివారం విద్యార్థులకు ఉచిత సమ్మర్‌క్యాంప్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ప్రత్యేక అతిధిగా మోటీవేటర్‌గా జిజెపి జిల్లా మాజీ అధ్యక్షులు బి.చంద్రప్ప హాజరయ్యారు. సత్యసాయి తల్లి ఈశ్వరమ్మ వర్ధంతి పురస్కరించుకొని విద్యార్థులకుఈ క్యాంప్‌ను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు పాండురంగారావు వివరించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు చంద్రప్ప చైతన్యవంతుల్ని చేస్తూ బాబా ప్రధాన ఆశయాలను,జీవుల పట్ల ప్రేమానురాగాలను,సేవలను గురించి వివరించారు. అంతేకాక సమాజంలో మానవాళికి అందించిన సేవలను వివరించారు. ఈ సందర్భంగా బాల వికాస్ విద్యావిధానంను అనుసరించటం వల్ల క్రమశిక్షణ అలవడుతుందన్నారు. ఇష్టపడి చదివితే ఎలా ప్రయోజకులు అవుతారో వివరించారు.ఈ కార్యక్రమాల్లో సత్యసాయిబాబా చారిటి ట్రస్టు నిర్వాహకులు పాండురంగారావు సభకు అధ్యక్షత వహించారు. వాసుదేవరావు, చెంగయ్య, నాగభూషణం,మల్లీశ్వరి ప్రేమకుమారి విద్యార్థులు సాయి భక్తులు హాజరయ్యారు.

## దక్షిణ కాళీ వారాహి శక్తి పీఠం అమ్మవారికి అమావాస్య ప్రత్యేక పూజలు



పుత్తూరు రూరల్,ఏప్రిల్ 27 ప్రభాతవార్త:

పుత్తూరు సమీపంలో ఉన్న పరమేశ్వర మంగళం నగరి మధ్యలో శ్రీ దక్షిణ కాళీ వారాహి శక్తిపీఠంలో ఆదివారం ఛైర్మన్ మోహనమ్మ ఆధ్వర్యంలో అమావాస్య పూజలను హోమాలతో నిర్వహించి విశేష అలంకరణతో వారాహి, కాళికాదేవి విశేష అలంకరించి సుమారు 350 మందికి అన్నదాన కార్యక్రమ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కౌట్స్ విద్యార్థులు పాల్గొని భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

# గూడూరు డివిజన్

## అల్లంపాడు బస్సు సర్వీసు పునరుద్ధరణ



కోట, ఏప్రిల్ 27 ప్రభాతవార్త : మండలం అల్లంపాడు గ్రామానికి ఆర్టీసీ బస్సును పునరుద్ధరించారు. ఆ మేరకు ఆదివారం బస్సు సర్వీసును సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి, ఉప సర్పంచ్ దేవరాల రాంబాబు, డిపో మేనేజర్ చిన పెంచ లయ్యలు ప్రారంభించారు. గత పదేళ్లుగా ఈ ప్రాంతంలో నడుపుతున్న ఆర్టీసీ బస్సు రద్దయింది. దీంతో ప్రయాణికులు ఆటోలలో రాకపోకలు సాగించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డిని కలిసి సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరించారు. దీంతో సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి సానుకూలంగా స్పందించి బస్సు సర్వీసు పునరుద్దరణకు ఆదేశాలిచ్చారు. గతంలో ఈ ప్రాంత ప్రజలు కోట నుంచి నెల్లూరుకు వెళ్లాలటే ఉదయం 4.30 గంటలకు అల్లంపాడు బస్సు కోసం ఎదురు చూసేవారు. తిరిగి రాత్రి 7 గంటలకు నెల్లూరులో 9 గంటలకు నైట్‌హాల్ట్ అల్లంపాడుకు ఈ బస్సు నడిచేది. ప్రస్తుతం బస్సును పునరుద్ధరించడంతో ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డికి సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి, ఉపసర్పంచ్ దేవరాల రాంబాబు కృతజ్ఞతలు తెలిపారు.

## గోపాల్ కుటుంబాన్ని పరామర్శించిన



గూడూరు, ఏప్రిల్ 27 ప్రభాతవార్త : చిల్లకూరు మండలంలోని తిమ్మనగారి పాలెంలో ఇటీవల టిడిపి రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి యానాది కుటుంబానికి చెందిన కుదుముల గోపాల్ మరణించారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర టిడిపి ఎస్టీ సెల్ అధ్యక్షు లు ఎం.ధారు నాయక్ ఆకుటుంబానికి పరామర్శించి, ధైర్యం చెప్పి,పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వారితో పాటు రాష్ట్ర పార్టీ ఎస్టీ సెల్ కార్యదర్శి మొగలి కల్లయ్య రాష్ట్ర బిదిది డైరెక్టర్లు రవికుమార్, అవుల అరుణ,రాష్ట్ర ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి కళావతి, పిరిగల నవీన్, మనోహర్ నాయక్, తిరుపతి ఎస్టీ సెల్ పార్లమెంట్ అధ్యక్షులు యం.సుబ్బయ్య, పార్లమెంట్ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి చలపతి రావు పాల్గొన్నారు.

## ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా ప్లేస్మెంట్ డే



గూడూరు, ఏప్రిల్ 27 ప్రభాతవార్త : ఆదిశంకర ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఆదివారం ప్లేస్మెంట్ డే కార్యక్రమాన్ని ఎంతో ఘనంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. విద్యార్థులు పరిశ్రమ అనుసంధాన ప్రయాణంలో ఇది మరొక గొప్ప మైలురాయిగా నిలిచింది. ఈ కార్యక్రమానికి ప్రపంచంలోనే మొట్టమొదటి ఏఐ ప్రత్యేకమైన డిగ్రీ మంజూరు చేసే ఆన్‌లైన్ విద్యా సంస్థ అయిన సారస్ వ్యవస్థాపకులు, సిఈఓ అమిత్ కటారియా ముఖ్య అతిథిగా విచ్చేసి, విద్యార్థులను ఉద్దేశించి ప్రేరణాత్మక ప్రసంగం చేశారు. తమ ప్రసంగంలో ఆయన, నిరంతర అభ్యాసం నైపుణ్యాభివృద్ధి ప్రాముఖ్యతను వివరించి, విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాలని ప్రోత్సహిం చారు. అలాగే విద్యార్థులకు ప్రపంచ స్థాయి అవకాశాలను కల్పిస్తూ, జాతీయ స్థాయిలో ప్రతిభను ప్రదర్శించేందుకు వేదిక అందించినందుకు ఆధిశంకర కళాశాలను ప్రత్యేకంగా అభినందిం చారు. ఛైర్మన్ వంక పెంచాలయ్య, వైస్ ఛైర్మన్ అనూష విద్యార్థులకు అభినందనలు తెలిపి వారి విజయాలకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల అభ్యున్నతికి కళాశాల చేస్తున్న కృషిని వారు ప్రశంసించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ రాజా మురుగదాస్ మాట్లాడుతూ విద్యార్థులు వారి విజయాలు ఆధిశంకర కీర్తిని మరింత పెంచాయని, ఇది ప్రతి విద్యార్థి తపనతో సాధించిన గర్వకారణమైన విజయమని పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరంలో 669 ప్లేస్మెంట్ ఆఫర్లు, 483 స్టైఫండ్ ఇంటర్న్‌షిప్‌లు, 1433 విజయవంతమైన ఇంటర్న్‌షిప్‌లు సాధించడం ద్వారా ఆదిశంకర విద్యార్థులు పరిశ్రమను సిద్ధమైన నైపుణ్యాలతో దేశ వ్యాప్త గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ వేడుకల్లో సిడిసి డీన్ శ్రీనివాస్, ఐ క్యూబ్ డీన్ డాక్టర్ వేణుమాధవ్, అకాడెమిక్స్ డీన్ డాక్టర్ రాజయ్య, డాక్టర్ ధనుంజయ్, అన్ని విభాగాల విభాగాధిపతులు, ఐ క్యూబ్ కోఆర్డినేటర్లు, ప్లేస్మెంట్ కోఆర్డినేటర్లు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సూపర్ 30 టోర్నీ విజేతగా వాకాడు



వాకాడు, డాక్టర్ ప్రభాతవార్త : గూడూరు రూరల్ పరిధిలో మట్టిలో మాణిక్యాల అన్వేషణ లక్ష్యంగా జీఆర్‌సిసి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన సూపర్ 30క్రికెట్ టోర్నీలో వాకాడు అండర్ 15జట్టు విజేతగా నిలిచింది. ఆద్యంతం ఉత్కంఠంగా సాగిన ఈ టోర్నీలో అన్ని జట్లు పోటాపోటీగా ప్రతిభను కనబర్చాయి. ఉత్కంఠ పోరులో ఫైనల్ కు చెన్నూరు జట్టు వాకాడు జట్టు చేరాయి. మొదట బ్యాటింగ్ చేసిన వాకాడు జట్టు 105 పరుగులు నిర్ణీత లక్ష్యాన్ని విధించగా ప్రత్యర్థి జట్టు 35 పరుగులు చేసి లక్ష్యాన్ని చేధించడంలో పూర్తిగా విఫలయం అయింది. వాకాడు జట్టులో అరవింద్ ఉత్తమ ఆటగాడిగా ఎంపిక అయ్యాడు. బెస్ట్ బౌలర్‌గా అఖిల్ సాయి, బెస్ట్ ఫీల్డర్‌గా గురు తేజ, బెస్ట్ ప్రామిసింగ్ ప్లేయర్‌గా వెంకట్, ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా అరవింద్ ఎంపిక అయ్యారు. ముఖ్య అతిథులుగా ఎన్‌డిసిఏ అధ్యక్షులు ఎ. రాజశేఖర్ రెడ్డి, సెక్రటరీ కె.శ్రీనివాసులురెడ్డి, జిఆర్‌సిసి డైరెక్టర్ రామ్ గోపాల్, జాయింట్ సెక్రెటరీ అవినాష్, చీఫ్ కోచ్ దీపక్ ముల్లా, చీఫ్ సెలెక్టర్ విష్ణువర్ధన్ పాల్గొని విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు.

## వెంకటగిరి మిత్రమండలిచే మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు



వెంకటగిరి, ఏప్రిల్ 27 ప్రభాతవార్త : పట్టణంలో మిత్ర మండలి వారు పాద చారుల కోసం మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మిత్రమండలి సంస్థచే, వేసవిలో గత మూడు వారాలుగా మజ్జిగ చలివేంద్రలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా నేడు నాల్గవ ఆదివారం మజ్జిగ చలివేంద్ర మిత్ర మండలి సభ్యులు ఆర్ రాజేంద్రప్రసాద్ వారి సౌజన్యంతో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మిత్రమండలి అధ్యక్షులు దర్భ గురునాథ్ హైదరాబాద్ నుంచి వచ్చి పాల్గొన్నారు. మిత్రమండలి సభ్యులు నక్కల పోలయ్య, అంకా ప్రసాద్, కోన వెంకటేశ్వర్లు, సల్మాన్, వడ్డీ శ్రీనివాసులు, ఇవి కిరణ్ కుమార్ (నెల్లూరు) బాబు, నర్రా రవి, సుంకర రవికుమార్, కుమారి దర్భ ప్రణతి( హైదరాబాద్) తదితరులు పాల్గొన్నారు.

## చిన్ననాటి తీపి గుర్తులు గుర్తుకొస్తున్నాయి

**- సీనియర్ న్యాయవాది లక్కమనేని కోటేశ్వరరావు.**



వెంకటగిరి, ఏప్రిల్ 27 ప్రభాతవార్త : నలభై సంవత్సరాల నాటి తీపి గుర్తులు అందరి కలయికతో గుర్తుకొస్తున్నాయని సీనియర్ న్యాయవాది లక్కమనేని కోటేశ్వర రావు తెలిపారు. (ఎల్ కెఆర్) ఆర్విఎం ఉన్నత పాఠశాలలో 1984-85వ సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు పాఠశాలలో ఆత్మీయ అనురాగ సమ్మేళనం నిర్వహించారు. పూర్వపు విద్యార్థులందరూ కలిసి పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ అందరం చదివిన ఈ పాఠశాలకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. పేద విద్యార్థులను ఆదుకుంటామని చెప్పారు. అందరం 40 సంవత్సరాల తర్వాత కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. ఈ పాఠశాలలో చిన్నప్పుడు కలిసిమెలిసి తిరిగి తీపి గుర్తులు గుర్తుకొస్తున్నాయి అని తెలిపారు. పూర్వపు విద్యార్థులందరూ కలిసి ఆనందంగా గడిపారు. ఒకరిని ఒకరు కలిసి ఆత్మీయంగాపలకరించుకున్నారు. పాఠాలు బోధించిన ఉపాధ్యాయులు చెంచు కృష్ణయ్య, జేవీఎస్ శాస్త్రి, నర్రా మీనయ్య, సుధాకర్ రావు, పాపారావు, త్రివిక్రమ దాసులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు లక్కమనేని కోటేశ్వరరావు, మురళీకృష్ణ, రవికుమార్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాలు



వెంకటగిరి, ఏప్రిల్ 27 ప్రభాతవార్త: తూర్పు వీధిలోని గ్రంథాలయంలో ఈనెల 28వ తేదీ నుండి జూన్ నెల ఆరో తేదీ వరకు విద్యార్థుల కోసం వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి అల్లిశెట్టి అంజయ్య తెలిపారు. స్పోకెన్ ఇంగ్లీష్ కథలు, కెరీర్ గైడెన్స్, యోగ, కథనాలు డ్రాయింగ్ వంటి వాటిపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని చేసుకోవాలని ఆయన కోరారు.

## డిఎస్పి ఆధ్వర్యంలో తిలక్ నగర్‌లో కార్డన్ అండ్ సెర్చ్



గూడూరు, ఏప్రిల్ 27 ప్రభాతవార్త: పట్టణం 2 టౌన్ పరిధిలోని తిలక్ నగర్‌లో డిఎస్పీ గీతా కుమారి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ తనిఖీలలో భాగంగా 70 ఇళ్లను,(లాక్డ్ హౌసెస్, సీనియర్ సిటిజెన్ హౌసెస్) వాహనాలను చెక్ చేయడం జరిగినది సరైన రికార్డ్స్ లేనటువంటి రెండు ద్విచక్ర వాహనాలు సీజ్ చేసారు. ఇక్కడ నివసిస్తున్న వారికి ఎవరైనా అనుమానితులు కనపడిన వెంటనే 2టౌన్ పోలీసు వారికి సమాచారం తెలపాలన్నారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ ఈ ఎండాకాలంలో దొంగతనాల ప్రమాదం పెరిగిన నేపథ్యంలో, అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటి ముందు లేదా బయట బైక్ ఉంచేటప్పుడు తప్పనిసరిగా లాక్ చేయండన్నారు. గూడూరు రైల్వే స్టేషన్ 5వ ప్లాట్‌ఫాం వద్ద కాకుండా, 1వ ప్లాట్‌ఫాం వద్ద కేటాయించిన బైక్ పార్కింగ్ ప్రదేశాన్ని మాత్రమే వినియోగించాలన్నారు. పార్కింగ్ లేని ప్రదేశాల్లో వాహనాలు ఉంచకుండా జాగ్రత్త వహించండి. సుదూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు ఇంటిలో నగదు, బంగారం వదిలి పెట్టకుండా సురక్షితంగా భద్రపరచండి. ఇల్లు ఖాళీగా వదిలేటప్పుడు పక్కవారికి సమాచారం ఇవ్వాలన్నారు. బలమైన తాళాలు వాడాలని, ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించి నప్పుడు వెంటనే గూడూరు 2 టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వండన్నారు. మీ సహకారమే మా బలము. మన ప్రాంతాన్ని దొంగతనాల నుండి రక్షిద్దామని స్థానికులను డిఎస్పి గీతా కుమారి కోరారు.

## బాలాయపల్లి తహశీల్దార్... సబ్ కలెక్టర్ కార్యాలయానికి బదిలీ



బాలాయపల్లి, డాక్టర్ ప్రభాతవార్త : మండలం తహసీల్దార్ పి. శ్రీనివాసులు గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. బాలాయపల్లి మండలం తహసీల్దార్‌గా చిట్టమూరు డిప్యూటీ తహసీల్దార్ వి. విజయలక్ష్మికి పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసారు.

## మే2 నుంచి వేసవి క్రికెట్ శిక్షణ శిబిరం ప్రారంభం

**- ఏసిఏ సబ్ సెంటర్ ఇన్చార్జి మునిగిరీష్**



గూడూరు, ఏప్రిల్ 27 ప్రభాతవార్త :అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఉన్న ఏసీఏ సబ్ సెంటర్ నందు సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంప్ మే రెండవ తారీకు ప్రారంభం అవుతుంది. నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ వారి సహకారంతో ఏ సి ఏ సబ్ సెంటర్ నందు ఈ వేసవి క్రికెట్ శిక్షణ శిబిరం ప్రారంభమవుతుంది అని ఏసీఏ సబ్ సెంటర్ ఇన్చార్జ్ మునిగిరీష్ తెలిపారు. ఈ శిక్షణ శిబిరంలో ఏడు సంవత్సరముల వయసు నుండి 16 సంవత్సరముల వయసు వరకు ఉన్నటువంటి పిల్లలు ఈ శిక్షణా శిబిరానికి రావచ్చును అని తెలిపారు. ఈ నెల రోజులపాటు జరిగేటువంటి ఈ శిక్షణా శిబిరంలో క్రీడాకారు లందరికి డైట్‌తో పాటు స్పోర్ట్స్ షర్టు కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి మస్తాన్, నెల్లూరు జిల్లా క్రికెటర్ అసోసియేషన్ కౌన్సిలర్ అనిల్ కుమార్ సీనియర కోచ్ సురేందర్ రెడ్డి, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కోచ్ లవకుమార్, గూడూరు క్రికెట్ క్లబ్ సెక్రటరీ నాగేశ్వరరావు, మహేష్, నూర్ మొహమ్మద్, రజిని, సుబ్రహ్మణ్యం, విజయ్ కుమార్, సంతాన్ తదితర క్రీడాకారులు పాల్గొన్నారు.

## ప్రతి లెక్కా.. ఇకపై పక్కా

**- చేతి రాతలతో సర్దుబాట్లు, దిద్దుబాట్లకు చెల్లు**

కోట, ఏప్రిల్ 27 ప్రభాతవార్త : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను (పిఎసిఎస్) కంప్యూటరీకరణ చేశారు. బ్యాంకుల మాదిరిగానే పిఎసిఎస్‌లలో లావాదేవీలన్నీ ఈ నెల నుంచి ఆన్‌లైన్‌లో జరుగుతున్నాయి. దీనివలన గతంలోలాగా అక్రమాలకు పాల్పడటానికి అవకాశం ఉండదు. ఇటీవల వరకు సొసైటీలలో వ్యవహారాలన్నీ సాధారణ పద్ధతుల్లో జరిగేవి. చేతి రాతలతో రికార్డులను తారుమారు చేసే అవకాశం ఉండేది. వాయిదాలు చెల్లించకుండా సర్దుబాటు చేయడం, బినామీల పేరిట బొక్కేశారు. ఈ సంఘాలను నేతలు తమ సొంత అవసరాల కోసం నష్టాల్లోకి నెట్టేసేవారు. ఏళ్ల తరబడి సాగుతున్న ఈ చేతివాటానికి ఇన్నాళ్లకు చెక్ పెట్టగలిగారు. తిరుపతి జిల్లాలో 56 సంఘాల్లో ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. సహకార సంఘాల్లో కంప్యూటరీకరణ ప్రక్రియను 2023 నుంచి మొదలు పెట్టారు. సంఘం ఏర్పడినప్పటి నుంచి గత ఏడాది మార్చి 31వ తేదీ వరకు జరిగిన లావాదేవీలన్నీ డేటా క్యాప్చర్ టూల్ అనే సాఫ్ట్‌వేర్‌తో ఆన్‌లైన్ చేశారు. పాత రికార్డులన్నీ అందుబాటులో లేకపోవడం, సిబ్బందికి అవగాహన లేమి వలన కంప్యూటరీకరణ నత్తనడకన సాగుతూ వచ్చింది. కేంద్రం నుంచి ఒత్తిడి పెరగడం, అధికారులు తరచూ సమీక్షలు పెట్టి లక్ష్యాలు విధించడంతో ఎట్టకేలకు గత నెలాఖరు నాటికి పూర్తి చేయగలిగారు. బ్యాంకుల తరహాలో ఆన్‌లైన్‌లో సేవలు అందిస్తున్నారు.

## పేటలో కలుషిత ఆహారం తిని పలువురికి అస్వస్థత!

నాయుడుపేట, ఏప్రిల్ 27 ప్రభాతవార్త : నాయుడుపేట పట్టణంలోని ప్రముఖ హోటల్లో కలుషిత ఆహారం తీసుకొని పలువురు అస్వస్థతకు గురైన సంఘటన ఆలస్యంగా వెలుగుతోనికి వచ్చింది. పట్టణానికి చెందిన ఓ ప్యామిలీ స్నేహితులకు పార్టీ ఇచేందుకు ప్రముఖ హోటల్‌కు చేరుకొని డిన్నర్ చేశారు. అయితే డిన్నర్ చేసిన కొద్దిచేపటికే ఆ కుటుంబ సభ్యులకు వాంతులు, విరేచ నాలతో అస్వస్థతకు గురిరై ప్రవేటు వైద్యశాలకు పరుగులు తీశారు. పట్టణంలో రెస్టారెంట్లు, బిరియాని,ఫ్రైడ్రైస్,హోటళ్ళు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నా సంబందిత ఫుడ్ఇన్స్ పెక్టర్లు పర్యవేక్షణ లోపం, నిర్లక్ష్యం కారణంగా కలుషిత ఆహారం తీసుకొని అస్వస్థతకు గురౌతున్నారు. ఈ విషయమై ఫుడ్ఇన్స్ పెక్టరు నర్మదాను వివరణ కోరగా ఆమె మాట్లడుతూ నాయుడుపేట పట్టణంలో హోటళ్ళపై తనిఖీలు చేపట్టి నిర్వహకులపై కేసులు నమోదుచేసి చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

## నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం ఇవ్వకుంటే ఉద్యమం తప్పదు

**- రాష్ట్ర వైసీపీ కార్యదర్శి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి**



కోట, ఏప్రిల్ 27 ప్రభాతవార్త : కొత్తపట్నం పంచాయతీ పరిధిలోని క్రిస్‌సిటికి ప్రభుత్వం రైతుల నుంచి 2,500 ఎకరాలను కోట, చిల్లకూరు మండలాల నుంచి తీసుకుందని రాష్ట్ర వైసీపీ కార్యదర్శి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి చెప్పారు. ఆదివారం కొత్తపట్నం పంచాయతీ పరిధిలోని శ్రీనివాససత్రంలో రైతులతో కలిసి శ్యాంప్రసాద్‌రెడ్డి విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. 2019-24 సంవత్స రంలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు క్రిస్‌సిటీ ఏర్పాటుకు కావలసిన భూములను తీసుకున్నారని చెప్పారు. అప్పట్లో గూడూరు సబ్ కలెక్టర్ గోపాలకృష్ణ అసైన్డ్, డికెటి భూములకు ఎకరాకు రూ.15 లక్షలు, పట్టా భూములకు రూ.23 లక్షలు కేటాయించారని చెప్పారు. ఆక్రమణలకు ఎకరాకు రూ.7 లక్షలు ఇస్తామని చెప్పారని గుర్తు చేశారు. ఆ క్రమంలో సీఎం కార్యాలయంలో కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించారని చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మారడంతో అధికారులు కూడా మారిపోయారని చెప్పారు. దీంతో తహశీల్దార్ చెప్పిందే శాసనమవుతుందన్నారు. మరి ఎమ్మెల్యేలు, మంత్రులు చట్టప్రకారం నడుచుకోకుండా అంతా వారి ఇష్టప్రకారం నడుచుకోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతు న్నారని చెప్పారు. అధికారులు అత్యుత్సాహం చూపి రైతులకు పరిహారం తగ్గిస్తే ఒప్పుకునేది లేదన్నారు. అవసరమైతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని తెలిపారు. ప్రభుత్వం పక్షపాత ధోరణితో వ్యవహరిస్తే ఈ ప్రాంతంలో తోళ్ల పరిశ్రమను వ్యతిరేకించినట్లే మరోసారి తీరప్రాంత రైతులతో కలిసి ఉద్యమం చేయక తప్పదన్నారు. ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌కు ఈ ప్రాంత రైతాంగం కష్టనష్టాలు కూడా తెలుసని, ఆయన జోక్యం చేసుకొని రైతుల తరపున మాట్లాడాలని కోరారు. ఈ సమావేశంలో వైసీపీ పంచాయతీరాజ్ రాష్ట్ర కార్యదర్శి పాదర్తి రాధాకృష్ణారెడ్డి, మాజీ జడ్పిటిసి ఉప్పల ప్రసాద్ గౌడ్, సర్పంచ్ తిరుపాలయ్య, వేణురెడ్డి, దువ్వూరు సాయికృష్ణారెడ్డి, విన్నమాల ప్రభాకర్, ఉప్పల ప్రభాకర్, వెంకటాద్రి, తీరప్రాంత రైతులు పాల్గొన్నారు.

## మత్స్యకారుల సంక్షేమమే సిఎం చంద్రబాబు లక్ష్యం

**ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్**



పుత్తూరు, ఏప్రిల్ 27 ప్రభాతవార్త : మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యంగా చేపల వేట నిషేధ సమయంలో ఆర్థిక సాయాన్ని రెట్టింపు చేస్తూ మరో ఎన్నికల హామీని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నెరవేర్చారని ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ తెలిపారు. గత ప్రభుత్వంలో చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ. 10,000 ఆర్థిక సాయం అందించేవారన్నారు. మత్స్యకారుల ఇబ్బందులు దృష్టిలో వుంచుకుని చంద్రబాబునాయుడు పది వేలను రూ. 20,000లుగా రెట్టింపు చేసి సాయం చేస్తున్నారని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర వ్యాప్తంగా 1,29,178 మత్స్యకార కుటుంబాలకు రూ. 20,000 చొప్పున మొత్తం రూ. 259 కోట్లు అందించి చంద్రబాబు చరిత్ర సృష్టించారని తెలిపారు. అసలు చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు భృతిని ప్రవేశపెట్టిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రతి నెల 68,396 మందికి పెన్షన్లు అందిస్తున్నామని తెలిపారు. 2019-24 సంవత్సరాల మధ్య జగన్ ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధిపై చిన్నచూపు చూసిందని విమర్శించారు. ఫిష్ ఆంధ్ర అంటూ రూ. 300 కోట్లు ఖర్చు చేసినా, ఒక్క మత్స్యకారుని కుటుంబానికి ఎటువంటి మేలు జరగలేదని మండిపడ్డారు. టిడిపి విధానాల వల్ల దేశంలో ఉత్పత్తి అయ్యే మత్స్య సంపదలో 29 శాతం ఆంధ్రప్రదేశ్ నుంచే జరుగుతోందని తెలిపారు. విదేశాలకు ఎగుమతిలో 32 శాతం వాటా కూడా ఆంధ్రప్రదేశ్‌దే వుందని వివరించారు.

## ఉపాధి ఉద్యోగుల సీనియార్టీలో అక్రమాలు

**- పదోన్నతులకు అర్హత లేకపోయినా పొందడానికి ప్రక్కదారులు**

చిత్తూరు, ఏప్రిల్ 27 ప్రభాతవార్త: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సీనియార్టీ జాబితాలో భారీ అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపణలు మిన్నంటుతున్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఉపాధి ఉద్యోగులకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ నిర్ణయం తీసుకుంది. ఉపాధి ఉద్యోగులు గత ప్రభుత్వంలో ఎలాంటి లబ్ది పొందలేదు. 2017లో అప్పటి ప్రభుత్వం ఉపాధి ఉద్యోగులకు పెంచిన జీతాలు, పదోన్నతులు మినహాయించి వీరికి ఇప్పటి వరకు ఎలాంటి ప్రయోజనం కలుగలేదు. 2017 సంవత్సరంలో ఉపాధి ఉద్యోగులకు పదోన్నతులు లభించినప్పటికీ ఇందులో అర్హులైన వారికి తీరని అన్యాయం జరిగిందనే విమర్శలు వున్నాయి. ఈ పదోన్నతుల్లో అక్రమంగా పలువురు ఉద్యోగులు పదోన్నతులు పొందినట్లు ఇప్పటికీ ఆ శాఖ ఉద్యోగులు చర్చించుకుంటుంటారు. ఇదే తరహాలో ప్రస్తుతం ఉపాధి ఉద్యోగుల పదోన్నతుల్లో లబ్ది పొందడానికి అక్రమార్కులు తమ వంతు ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నారు. ఈ క్రమంలో ఉపాధి ఉద్యోగులకు చెందిన ఎస్ఆర్‌డిఎస్ వెబ్‌సైట్‌లో వుంచిన ఉద్యోగుల సీనియార్టీ జాబితా తప్పుల తడకగా వుందని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఒక్క టెక్నికల్ అసిస్టెంట్ల సీనియార్టీ జాబితాలోనే 250 మందికి పైగా తప్పుడు డేట్ ఆఫ్ జాయినింగ్ నమోదు చేసి అక్రమంగా పదోన్నతి పొందాలని చూస్తున్నారని తెలిసింది. అలాగే 2006 జూన్ 5న పిఓ, ఎపిఓ వ్యవస్థ అమలులోకి వచ్చింది. అయితే కొంతమంది 2003 నుండి 2006 సంవత్సరం జూన్ ముందు వరకు ఎపిఓలుగా విధుల్లో చేరినట్లు సీనియార్టీ జాబితాలో వుండటంతో వాస్తవాలు తెలిసిన అభ్యర్థులు ఖంగు తింటున్నారు. ఈ విషయంపై ఉపాధి ఉద్యోగులు కోర్టును ఆశ్రయించినా వారికి ఆశించిన లబ్ది కలుగలేదు. అలాగే ఉపాధి ఉద్యోగుల సంక్షేమం కోసం విధులు నిర్వర్తించాల్సిన హెచ్‌ఆర్ విభాగం అధికారులు ఈ విషయంపై సరిగా దృష్టి పెట్టకపోవడంతోనే ఇలాంటి అక్రమాలు పుట్టుకువస్తున్నప్పటికీ ఏమి చేయలేని పరిస్థితి నెలకొందని ఉపాధి ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

## నేడే కుప్పం మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక

**- పరిశీలకులుగా జాయింట్ కలెక్టర్.. ఎన్నికైన కౌన్సిలర్లకే ప్రవేశం !!**

**- మండల కార్యాలయంలో ఏర్పాట్లు పూర్తి.. వందమందితో భారీ పోలీసు బందోబస్తు**



కుప్పం, ఏప్రిల్ 27 ప్రభాతవార్త : మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక సోమవారం ఉదయం 11గంటలకు కుప్పం మండల కార్యాలయం సమావేశపు హాలులో జరగనుంది. ఈ ఎన్నికకు సంబంధించి అధికార యంత్రాంగం గట్టి ఏర్పాట్లతో పాటు భద్రతా చర్యలను చేపట్టారు. కుప్పం పట్టణంలో ఎన్నికల నేపథ్యంలో 144 సెక్షన్‌తో పాటు 30 పోలీస్‌యాక్ట్ అమలు చేస్తున్నారు. కాగా మండల కార్యాలయంలో ఎన్నికల ఏర్పాట్లను ఆదివారం కుప్పం డిఎస్పీ పార్థసారథి, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు, అర్బన్ సిఐ శంకరయ్యలు పరిశీలించి తగు సూచనలు చేశారు. మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికను గాను జాయింట్ కలెక్టర్ విద్యాధరి ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరిస్తారు. అలాగే ప్రిసైడింగ్ అధికారిగా కుప్పం ఆర్డీఓ శ్రీనివాసులు రాజు వ్యవహరిస్తారు. ఛైర్మన్ ఎన్నికకు సంబంధించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు ఉన్నతాధికారులు కూడా తగు చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాలతో ఒక ఎఎస్పీ, ముగ్గురు డిఎస్పీలు, సిఐలతో సహా సుమారు 100మంది పోలీసులు ఎన్నికలకు సంబంధించి బందోబస్తు నిర్వహించనున్నారు.

**ఎన్నికైన కౌన్సిలర్లకే ప్రవేశం :** మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక సందర్భంగా ఆయా వార్డుల్లో ఎన్నికైన కౌన్సిలర్లనే ఎన్నికలు జరిగే సమావేశపు హాలులోకి అనుమతిస్తామని డిఎస్పీ పార్థసారథి తెలిపారు. ఇతరులు ఎవర్నీ అనుమతించేది లేదన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.

## ఉక్కపోత...తీవ్రమైన ఉష్ణోగ్రతలు!

**సూర్యుని వేడికి జనం విలవిల**



తిరుపతి,ఏప్రిల్ 27ప్రభాతవార్త: వేసవిలో సూర్యుని మంటలకు భూమిపై జనం విలవిల్లాడిపోతున్నారు. పర్యావరణం దెబ్బతిని, పచ్చనిచెట్లు కనుమరుగైపో తుండటంతో వేడివాతావరణం రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. సూర్య దేవుడు ఉదయం 7గంటలకే నిప్పుల వర్షం కురుస్తున్నాడు. గత రెండువారాలుగా ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉండటంతో 42డిగ్రీలు గరిష్ఠంగా నమోదవుతోంది. తిరుపతి యాత్రాస్థలం కావడంతో రోజుకు 60వేలమంది యాత్రికులు వస్తున్నారు. వీరంతా కూడా వేడికి అల్లాడిపోతూన్నారు. మండే ఎండలకే తట్టుకోలేక నీళ్లసీసాలు కొనుగోలుచేసి మొఖం కడుక్కోవడం, తలపై నీరు పోసుకోవడం చేస్తున్నారు. తిరుమలకొండపై ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపిల్లలు, వృద్దులు ఈ వేడికి కన్నీళ్ళు పెడుతున్నారు. శుక్రవారం 42డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదుతో రాత్రి 9గంటలకు కూడా వేడి తగ్గడం లేదు. చెట్లుపెంచడంపై ప్రస్తుత ప్రభుత్వం కూడా పెద్దగా పట్టించుకోవడంలేదనేది జనం వాపోతున్నారు. వేడివాతావరణానికి జనం విలవిల్లాడుతున్నారు. రానున్న రెండురోజులు మరింత తీవ్ర ఎండలు ఉంటాయని వాతావరణశాఖ హెచ్చరికలతో జనం మరింత అవస్థలు తప్పదు.. వేసవిలో చల్లటి వాతావరణం ఎప్పుడొస్తుందా అని జనం ఎదురుచూస్తున్నారు. ఈ సూర్యుడు చల్లబడయ్యా అంటూ జనం వేడుకుంటున్నారు. భిన్నమైన వాతావరణ పరిస్థితుల్లో జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ పరిస్థితి ఇలాగే ఉండటంతో జనం ఎండవేడికి ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో తిరుపతి, శ్రీకాళహస్తి, పుత్తూరు, చిత్తూరు, పలమనేరు, సత్యవేడు ప్రాంతాల్లో కూడా 41డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఎండతీవ్రత తెలియజేస్తుంది.

## సుప్రభాతసేవలో సినీనటుడు నాని



తిరుమల,ఏప్రిల్ 27ప్రభాతవార్తప్రతినిధి: సినీనటుడు నాని ఆదివారం వేకువజామున తిరుమలేశుని సుప్ర భాతసేవలో పాల్గొన్నారు. ఆయనతోబాటు నటి శ్రీనిధిశెట్టి చిత్ర బృందం స్వామివారి ఆశీస్సు లందుకున్నారు.

## తిప్పారెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే



తిరుపతి విద్య, ఏప్రిల్ 27 ప్రభాతవార్త : స్థానిక మహతి ఆడిటోరియంలో తిరుపతి సిటీ ఛాంబర్ 2025 సంవత్సరానికి లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డ్స్ కు ఎంపికైన వారిని ఆదివారం సన్మానించడం జరిగింది .డాక్టర్ అంబేద్కర్ గ్లోబల్ లా ఇన్స్టిట్యూట్ అధినేత డాక్టర్ ఆర్ తిప్పారెడ్డి సమాజానికి చేసిన సేవలను గుర్తించి తిరుపతి సిటీ ఛాంబర్ నిర్వాహకులు లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డును స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాసులు,ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, మాజీ మంత్రి పరసారత్నం,మాజీ ఎమ్మెల్యేలు మోహన్, సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్ చేతుల మీదగా స్వీకరించారు. నిర్వాహలు కేఎస్ వాసు మాట్లాడుతూ తిప్పారెడ్డి న్యాయ కళాశాలను స్థాపించి 15 వేల మంది న్యాయవాదులను, 50 మంది జడ్జిలను, 60మంది లా అధికారులను తయారు చేసిన గొప్ప న్యాయ విద్యా ప్రదాత అన్నారు.1977 దివిసీమ ఉప్పెన సమయంలో చనిపోయిన మృతదేహాలకు దహన సంస్కారాలు నిర్వహించిన గొప్ప మానవతావాది అన్నారు.ముఖ్యంగా కడప జిల్లాలో భూ సేకరణ సమయంలో రైతుల పక్షాన నిలబడి ప్రభుత్వాలతో పోరాటం చేసిన ధీర శైలి అన్నారు. అవార్డు గ్రహీత డాక్టర్ తిప్పారెడ్డి మాట్లాడుతూ ఈ అవార్డు రావడంతో సమాజ సేవలో మరింత సహాయ సహకారాలు అందించేందుకు తోడ్పడతా నన్నారు. నేటి యువత న్యాయవిద్యను అభ్యసించి సమాజంలో జరిగే అన్యాయాలను ప్రశ్నించే విధంగా ముందుకు నడవాలి అన్నారు.ఈ అవార్డుకు నన్ను ఎంపిక చేసిన తిరుపతి సిటీ చాంబర్ వ్యవస్థాపక అధ్యక్షులు ఆయుబ్ ఖాన్,ఛైర్మన్ కే.ఎస్ వాసు,వ్యవస్థాపక కార్యదర్శి షణ్ముగం, ఉపాధ్యక్షులు స్టాన్లీ, పిసి స్వామి, డాక్టర్ పి ఎస్ కరుణానిధి,డాక్టర్ స్వరాజ్యలక్ష్మి,డైరెక్టర్స్ రాజానందిని, విశాలాక్షి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.